PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 294 | విజయవాడ, గురువారం 30 మే 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 30 May 2024 | Rs

విజయవాడలో అతిసార విజృంభణ

- పది రోజుల్లో నలుగురు మృతి
- వందమందికిపైగా బాధితులు
- వైద్య శిబిరాల ఏర్పాటు
- బాధిత కుటుంబాలకు సిపిఎం నేతల పరామర్శ

• లోపలి పేజీలో..•



ప్రాక్టీస్.. ప్రాక్టీస్...

- టైటిల్ ఫేవరెట్‌గా టీమిండియా
- టి20 ప్రపంచకప్‌కు సన్నద్ధం

6

4న రాత్రి 9 గంటలకు

ఎన్నికల తుది ఫలితాలు

- సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జూన్ 4న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ప్రధాన ఏర్పాట్లు పూర్తిచేశామని, అదేరోజు రాత్రి 9 గంటలకు తుది ఫలితాలను ప్రకటిస్తామని సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. న్యూఢిల్లీ నిర్వచన్ భవన్ నుండి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనరు నితీష్ వ్యాస్ బుధవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ముఖేష్ ఈ విషయం చెప్పారు. రాష్ట్రంలో ఓట్ల లెక్కింపు, నియోజకవర్గాల్లో చేస్తున్న ఏర్పాట్లపై నితీష్ వ్యాస్ ఆరా తీశారు. ఫలితాల ప్రకటనకు అనుసరిస్తున్న ప్రణాళిక బద్ధమైన చర్యలను, బందోబస్తు ఏర్పాట్లను ఇక్కడి ఎన్నికల అధికారులు నివేదించారు. రాష్ట్రంలో మొత్తం 175 శాసనసభ నియోజకవర్గాల్లో 111 నియోజకవర్గాల్లో 20 రౌండ్లలోపు, 61 నియోజకవర్గాల్లో 21 నుంచి 24 రౌండ్లలోపు, మిగిలిన మూడు నియోజకవర్గాల్లో 25 రౌండ్లకు పైగా ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నామన్నారు. 111 నియోజకవర్గాల్లో మధ్యాహ్నం 2 గంటల్లోపు, 61 నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటల్లోపు, మిగిలిన మూడు నియోజకవర్గాల్లో సాయంత్రం 6 గంటల్లోపు ఓట్ల లెక్కింపు పూర్తవుతుందని, మొత్తంగా రాత్రి 9 గంటలకు తుది ఫలితాలు వెల్లడిస్తామన్నారు. కాగా ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఎస్‌పిలు, సిపిలను అప్రమత్తం చేశామని అడిషనల్ డిజి, స్టేట్ పోలీస్ నోడల్ ఆఫీసరు ఎస్ బాగ్చీ తెలిపారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో అడిషనల్ సిఇఒ హరీందర్ ప్రసాద్, జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ కమిషనర్లు, ఎస్‌పిలు పాల్గొన్నారు.

పెద్దలకిస్తేనే ఫ్రీ హోల్డ్

- ప్రజాశక్తి పరిశీలనలో వెల్లడి
- నోరు విప్పడానికి భయపడుతున్న స్థానికులు

ఉత్తరాంధ్రలో అసైన్డ్ భూబాగోతం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, పూసపాటిరేగ, భోగాపురం

ఉత్తరాంధ్రలో అసైన్డ్ భూములను పెద్దలు స్వాహా చేస్తున్న విషయం కొద్దిరోజులుగా రాష్ట్రంలో చర్చనీయాంశమైంది. ఏకంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు, ప్రత్యారోపణలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో నిజాలు తెలుసుకునేందుకు నిగ్గు తేల్చేందుకు పూసపాటిరేగ, భోగాపురం, భీమిలి మండలాల్లో ప్రజాశక్తి పాత్రికేయుల బృందం పర్యటించింది. స్థానికులతో మాట్లాడింది. ఈ పరిశీలనలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికే కొన్ని వందల ఎకరాలు పెద్దల కబ్జాలోకి వెళ్లిపోయాయి. వారి దర్శకత్వంలో విశాఖపట్నం కేంద్రంగా తిష్టవేసిన బినామీ వ్యక్తులు దళితులను, పేదలను భయపెట్టి, బెదిరించి ఒప్పంద పత్రాలు రాయించుకున్నారు. ప్రభుత్వం జారీ చేసి 9/23 ఆర్డినెన్సు ప్రకారం ఫ్రీ హోల్డ్ జాబితాను ప్రకటించాల్సిఉండగా స్థానిక అధికారులు ఆ పనిచేయలేదు. పెద్దలతో ఒప్పందం చేసుకున్న భూములను మాత్రమే ఫ్రీ హోల్డ్ జాబితాలో చేర్చి స్వామి భక్తిని ప్రదర్శించుకున్నారు. జిల్లా స్థాయి అధికారుల ఈ చర్య వెనుక అత్యున్నత స్థాయి అధికారి ప్రమేయం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈ లావాదేవిలపై పెదవి విప్పడానికి స్థానికులు భయపడుతున్నారు. పేర్లు చెప్పేందుకు సిద్ధపడటం లేదు.



పూసపాటిరేగ మండలం చోడమ్మ అగ్రహారం పరిధిలో అసైన్డు భూములు

పూసపాటిరేగ మండలం కందివలస, చోడమ్మ అగ్రహారం, కనిమెట్ట రెవెన్యూ గ్రామాల పరిధిలో 200 ఎకరాలు దళితులు, ఇతర సామాజిక తరగతులకు చెందిన పేదల సాగులో ఉన్నాయి. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ ప్రాంతంలోని భూమి విలువ ఎకరా కోటి రూపాయల నుండి రూ.కోటి 30లక్షల వరకు పలుకుతోంది. దీంతో, ఈభూమిపై ల్యాండ్ మాఫియా కళ్లు పడ్డాయి. రాజకీయ నేతల బినామీలు గ్రామాల్లోకి వచ్చి ఎకరాకు రూ.20లక్షల చొప్పున బేరం కుదుర్చుకుంటున్నారు. దీనికి ఒప్పుకోని వారిని బెదిరిస్తున్నారు. స్థానిక పరిస్థితిని బట్టి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు అడ్వాన్సులు ఇచ్చారు. ఒక్క కందివలస గ్రామ పరిధిలోనే 80మంది రైతులకు చెందిన 104 ఎకరాల భూమికి ఆర్థిక ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు తెలిసింది. ఇదే మండలం జి.చోడవరంలో 100ఎకరాలు, కొప్పెర్లలో 40ఎకరాలు, ఇరుకొండలో 30ఎకరాలతోపాటు కొవ్వాడ, కోనాడ, బత్తివలసల్లో కూడా వందలాది ఎకరాల భూములపై అడ్వాన్సులు ఇచ్చి ఒప్పంద పత్రాలు రాయించుకున్నారు. ఈ మండలంలో 9/23 ఆర్డినెన్స్ పరిధిలోకి 600 ఎకరాలు రావాల్సివుంది. ఈ విషయం ఇప్పటి వరకు ఒక్కరైతుకు కూడా తెలియకపోవడం గమనార్హం. జిల్లా కలెక్టర్ ఫ్రీహోల్డ్ చేసిన ఉత్తర్వుల్లో ఈ మండలం నుంచి కేవలం నలుగురు రైతుల పేరున 8.15ఎకరాలు మాత్రమే ఉన్నాయి. మరోవైపు ఆర్డినెన్స్ పరిధిలోకి వచ్చే భూముల వివరాలు పెద్దల చేతుల్లోకి వెళ్లాయి.

పెద్దలకు అందుబాటులో

భూమిని సాగుచేస్తున్న రైతు వద్ద లేని సమాచారం ప్రభుత్వ పెద్దలకు మాత్రం అందుబాటులోకి వెళ్లిపోయింది. ఆ నాయకుల బినామీలు గ్రామాల్లో తిరుగుతూ సర్వే నెంబర్ల ఆధారంగా అసైన్డ్ భూములను పరిశీలించారు. అనంతరం ఫ్రీ హోల్డ్‌లో భూములు ఉన్న రైతులను కలిసి కొనుగోలు చేసేందుకు ప్రయత్నించారు. వారికి తమ భూములు ఫ్రీ హోల్డ్‌లో ఉన్నట్లు తెలియకపోవడంతో దానిని అవకాశంగా తీసుకుని ధరను భారీగా తగ్గించారు. తాము ఏదో రకంగా పట్టాలు తెచ్చుకుంటామని రైతులకు నచ్చచెప్పారు. దీనికి తొలుత గ్రామాల్లోని రెండు ప్రధాన పార్టీల నాయకులు సహకరించినట్లు చెబుతున్నారు. ఒప్పందం పూర్తికాగానే అధికారులు ఆ భూమిని ఫ్రీహోల్డ్ జాబితాలో చేరుస్తున్నట్లు తెలిసింది. దీంతో కొనుక్కున్న వారికి సర్వాధికారాలు లభిస్తున్నాయి. భోగాపురం మండలంలోని కంచేరు, కొంగవాని పాలెం, పోలిపల్లి, విశాఖ జిల్లాలో మిగతా 2లో

భూ దోపిడీలపై సమగ్ర విచారణ

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం డిమాండ్

3



ప్రచండ భానుడి ప్రతాపంతో

ఢిల్లీ విలవిల!

- 52.3 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత

న్యూఢిల్లీ : ప్రచండ భానుడి ప్రతాపానికి ఢిల్లీ విలవిలలాడింది. మధ్యాహ్నం 2.30గంటల సమయంలో ఢిల్లీలోని ముంగేష్‌పూర్‌లో ఉష్ణోగ్రత గరిష్ట స్థాయిలో 52.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయింది. ఇదొక రికార్డు. ఢిల్లీతో సహా దేశంలోని పలు ప్రాంతాలు తీవ్రమైన వడగాడ్పులతో అట్టుడికాయి. ఢిల్లీ శివారు ప్రాంతమైన ముంగేష్‌పూర్‌లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదయింది. రాజస్థాన్ ఎడారి ప్రాంతంలో గతంలో 51.3 డిగ్రీలుగా నమోదైంది. అప్పటికి అదే రికార్డు. ఆ రికార్డును అధిగమించి బుధవారం ఢిల్లీలో 52.3 డిగ్రీలు నమోదు కాగా, మంగళవారం వాయవ్య ఢిల్లీలో 49.9 డిగ్రీలు నమోదైంది.

అత్యధిక వేడిమితో ప్రజలు అల్లాడిపోతుండడంతో నగరంలో విద్యుత్ డిమాండ్ కూడా బాగా పెరిగింది. మరోవైపు నీటి కొరత కూడా తీవ్రంగానే వుంది. దేశ రాజధాని చరిత్రలోనే మొదటిసారిగా బుధవారం విద్యుత్ డిమాండ్ 8,300 మెగావాట్ల మార్కును దాటింది..

తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ప్రాంతాలకు నీటి సరఫరాను పెంపొందించేందుకు గాను చాలా ప్రాంతాల్లో నీటి సరఫరాలను నియంత్రించినట్లు ఢిల్లీ జల వనరుల శాఖ మంత్రి అతిషి చెప్పారు. ఎవరైనా నీటిని వృధా చేసినట్లు వెల్లడైతే రూ.2వేల వరకు జరిమానా విధిస్తామని కూడా హెచ్చరించారు.

కారణమేంటంటే... 2

మరో ఏడు మాసాల దాకా

యుద్ధం కొనసాగిస్తాం

నెతన్యాహు ప్రభుత్వ హూంకరింపు

దాడులు ఆపాలంటూ భద్రతామండలిలో అల్జీరియా తీర్మానం

గాజా : గాజాపై దాడులను తక్షణమే ఆపాలని అంతర్జాతీయ సమాజం చేస్తున్న డిమాండ్‌ను బేఖాతరు చేస్తున్న నెతన్యాహు ప్రభుత్వం ఈ యుద్ధం కనీసం ఈ ఏడాది చివరి దాకా కొనసాగుతుందని హూంకరించారు. ఆదివారం రాత్రి పశ్చిమ రఫాలోని తెల్ అల్ సుల్తాన్‌లో సహాయక శిబిరంపై సాగించిన ఊచకోతపై ప్రపంచవ్యాపితంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఈ హత్యలను ఆపాలంటూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో అల్జీరియా ముసాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించింది. మరోవైపు 'ఆల్ ది ఐస్ ఆన్ రఫా' హ్యాష్ ట్యాగ్ సోషల్ మీడియాలో బాగా ట్రెండ్ అవుతోంది. అక్కడ జరుగుతున్నది యుద్ధం కాదని, మారణహోమమని నిరసనకారులు నినదించారు. ఇజ్రాయిల్‌కు అతి పెద్ద మద్దతుదారుగా ఉన్న అమెరికా రఫాలోని సహాయక శిబిరంపై దాడి తరువాత కూడా ఇజ్రాయిల్ రెడ్ లైన్ దాటలేదని, ఎప్పటిలాగే ఆ దేశానికి తన మద్దతు కొనసాగుతుందని చెప్పింది. అమెరికా సామ్రాజ్యవాదం దన్ను చూసుకునే నెతన్యాహు ఇంతగా రెచ్చిపోతున్నాడు. ఈ యుద్ధం కనీసం మరో ఏడు మాసాల పాటు కొనసాగుతుందని నెతన్యాహు జాతీయ భద్రతా సలహాదారు జాచి హనెగ్బి అధికారికంగా వెల్లడించారు. గాజా, ఈజిప్ట్‌ల మధ్య ప్రాంతమైన ఫిలడెల్ఫియా కారిడార్ 75శాతం మిలటరీ అదుపులోకి వచ్చిందని చెప్పారు. మంగళవారం జరిగిన భద్రతా మండలి సమావేశంలో అల్జీరియా రాయబారి అమోర్ బెండ్జమా ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు. తక్షణమే కాల్పుల విరమణ అమలు చేయాలని, రఫాపై అన్ని రకాల దాడులను నిలిపివేయాలని తీర్మానం కోరుతోంది. పైగా గాజాలో నెలకొన్న దుర్భరమైన పరిస్థితుల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే అక్కడ మానవతా సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరింది. పౌరులపై, మౌలిక వసతులపై విచక్షణారహితంగా జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించింది. అల్జీరియా అభ్యర్థన మేరకు భద్రతా మండలి అత్యవసరంగా మంగళవారం సమావేశమైంది.

జూన్ 1 నుండి 5 వరకు

ఇంటికే పెన్షన్

- రూ.1,939 కోట్లు విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సామాజిక భద్రత పెన్షన్ల కోసం 65,30,808 లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రూ.1,939.35 కోట్లు విడుదల చేసింది. వీటిలో జూన్ ఒకటో తేదీన 47,74,733 ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా నగదు వేయనున్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకూ డోర్ టు డోర్ ద్వారా 17,56,105 మందికి పెన్షన్లు ఇవ్వనున్నారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ లేకుండా పెన్షన్లు పంపిణీ చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పెన్షన్‌దారుల బ్యాంకు ఖాతాల్లోకి జూన్ ఒకటిన నగదు బదిలీ చేస్తారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, వార్డు పరిపాలనా కార్యదర్శులు సంబంధిత బ్యాంకు శాఖల నుండి మే 31వ తేదీన పెన్షన్ నగదు డ్రా చేసుకుని సంబంధిత సిబ్బందికి అందించాలని ఆదేశించారు.

'జక్కా' స్ఫూర్తితో విజ్ఞాన వికాసం

- వెంకయ్య హాలు ప్రారంభ సభలో పి మధు ఆకాంక్ష



ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న పి.మధు, వేదికపై వి.శ్రీనివాసరావు, రమేష్ తదితరులు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

జక్కా వెంకయ్య పేరుతో నిర్మించిన స్మారక హాల్లో విజ్ఞాన వికాసం జరగాలని మానికేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ పి.మధు అన్నారు. బుధవారం నెల్లూరు నగరంలో జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జక్కా వెంకయ్య 6వ వర్ధంతి సందర్భంగా నూతనంగా నిర్మించిన జక్కా వెంకయ్య స్మారక మెమోరియల్ హాలును మధు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జక్కా వెంకయ్య నెల్లూరు జిల్లా పేద ప్రజలు, కార్మికులు, కర్షకులు, కష్టజీవుల కోసం 70 సంవత్సరాలు పనిచేశారన్నారు. నిస్వార్థ ప్రజాసేవకునిగా తన జీవిత కాలం పాటుపడ్డారని వివరించారు. దళితులు, గిరిజనులు, పేదలకు న్యాయం జరగడానికి ఆయన చేసిన కృషి నెల్లూరు జిల్లాలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. నెల్లూరు జిల్లాలో భూ పోరాటాలు, సామాజిక ఉద్యమాలు జక్కా వెంకయ్య నిర్వహించారని గుర్తు చేశారు. సారా వ్యతిరేక ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారని తెలిపారు. నెల్లూరులో ఆయన పేరిట నిర్మితమైన హాలులో యువత, మహిళలు, అన్ని తరగతుల ప్రజలు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. డాక్టర్ జెట్టి శేషారెడ్డి జిల్లాలో పేదలకు వైద్యం అందించి ప్రజా డాక్టర్‌గా నిలిచిపోయారని, జక్కా వెంకయ్య పేద ప్రజల కోసం పనిచేసి ప్రజల మనిషిగా గుర్తింపు పొందారని తెలిపారు. ఒక ప్రజాప్రతినిధి ఎలా ఉండాలో జక్కా వెంకయ్య జీవన శైలిని చూసి నేర్చుకోవాలని పేర్కొన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జక్కా వెంకయ్య, డాక్టర్ శేషారెడ్డిలు ఒకే ఆశయంతో పనిచేశారన్నారు. జక్కా వెంకయ్య విప్లవ సాధనకు కృషి చేశారని, ఉన్నతమైన సమాజం కోసం చివరి వరకు పనిచేశారని వివరించారు. నెల్లూరులో జరిగిన ఉద్యమాల్లో చెరగని ముద్ర వేశారన్నారు. సిద్ధాంతాన్ని ఆచరణతో మేళవించి మంచి ఫలితాలు ఎలా సాధించాలో రుజువు చేశారని వివరించారు. అత్యంత నిపుణుడైన విప్లవకారునిగా పేరు తెచ్చుకున్నారన్నారు.

పోరాటాల్లో అందరి కన్నా ముందుండి నడిపించడంలో దిట్టని తెలిపారు. ఆయనను శ్రామిక ప్రజల పోరాట యోధుడుగా చెప్పవచ్చునన్నారు. గొప్ప మానవతావాది కూడా అని తెలిపారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు, విపత్తుల సమయంలో వారిని ఆదుకోవడానికి వివిధ రూపాల్లో సహాయపడేవారన్నారు. నెల్లూరుతోపాటు, అనేక జిల్లాల్లో సంభవించిన విపత్తుల్లో మిగతా 5లో

సీజన్‌కు ముందే నకిలీల జోరు

- మిర్చి విత్తనాల విక్రయంలో అక్రమాలు
- వ్యవసాయ శాఖ ప్రేక్షక పాత్ర!

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే నకిలీ మిర్చి విత్తనాల విక్రయాలు జరుగుతున్నాయి. ఎన్నికల కౌంటింగ్ హడావుడిలో అధికారులు ఎవ్వరూ ఇటువైపు కన్నెత్తి చూడరులే అన్న భావనలో అక్రమార్కులు సీజన్ ప్రారంభం ముందే వీటిని మార్కెట్లోకి వదిలారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏటా లక్షా 80 వేల ఎకరాల్లో మిర్చి సాగవుతోంది. ఎకరాకు వంద గ్రాముల విత్తనాలు వినియోగిస్తారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా విస్తీర్ణం కొన్నిసార్లు పెరుగుతోంది. మరికొన్నిసార్లు తగ్గుతోంది. పత్తి సాగు చేయని రైతులు మిర్చి వైపు మొగ్గుచూపుతారు. సాగుకు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు ఖర్చవుతోంది. గత ఐదేళ్లుగా మిర్చి ధర ఆశాజనకంగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు ఈ పంట వైపు మొగ్గారు. హైబ్రీడ్ విత్తనాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ధర ఎక్కువగా ఉండడం వల్ల హైబ్రీడ్ స్థానంలో నాటు విత్తనాలను కలిపి విక్రయిస్తున్నారు. నాటురకం మిర్చి విత్తనాలను కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తయారు చేసి అమ్ముతున్నారు. గుంటూరు, పత్తిపాడు, తాడికొండ, పెదకూరపాడు, పిడుగురాళ్ల, మాచర్ల ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు ఎక్కువగా విక్రయిస్తున్నారు. అయినా, వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు పట్టి పట్టనట్టు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆర్మూరు, తేజ, బాడిగ, సన్నాల వెరయిటీలు కిలో రూ.2 లక్షల వరకు పలుకుతుండడంతో ఇదే స్థాయిలో నాణ్యమైన విత్తనాలుగా ప్రచారం చేసి కిలో రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు నకిలీ విత్తనాలను విక్రయించి కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. వీటిని కర్ణాటక, తెలంగాణలో కిలో రూ.20 వేలకు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. వీటికి బిల్లులు ఇవ్వడం లేదు. లేబుల్స్ ఉన్నా ఆ కంపెనీలకు అనుమతులు లేనట్లు సమాచారం. ఈ నెల 25న గుంటూరు ఏటుకూరు రోడ్డులో 8.70 కిలోల నకిలీ విత్తనాలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల్లో జర్మినేషన్ విఫలమైన రకాలను తీసుకొచ్చి నాణ్యమైన హైబ్రీడ్ రకాల పేరుతో ఆకర్షణీయమైన ప్యాకింగ్ చేసి విక్రయాలు చేస్తున్నట్టు గుర్తించారు. తక్కువ ధరకు వస్తున్నాయని కొనుగోలు చేస్తే దిగుబడి రాక మోసపోవడం రైతుల వంతవుతోంది. జిల్లాలో ఎవరైనా నాణ్యతలేని విత్తనాలు లూజుగా కొని, ప్యాక్ చేసి అమ్ముతుంటే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విజిలెన్సు ఎస్‌పి ఈశ్వరరావు హెచ్చరించారు.



ఆకర్షణీయమై ప్యాకింగ్ కవర్లు, లేబుల్స్‌తో ఉన్న నకిలీ విత్తనాలు

బ్రిజ్ భూషణ్ కుమారుడి కారు

బీభత్సం

ఇద్దరు మృతి, ఒక మహిళకు తీవ్ర గాయాలు

లక్నో : మూడేళ్ల క్రితం లఖింపూర్ ఖేరిలో కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు నిరసన రైతులపైకి కారు పోనిచ్చిన ఘటనను మరచిపోక ముందే బిజెపి ఎంపి, భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షులు బ్రిజ్‌భూషణ్ సింగ్ కుమారుడు అదే తరహా దారుణానికి ఒడిగట్టాడు. కైసర్‌గంజ్ లోక్‌సభ స్థానంలో బిజెపి అభ్యర్థి కరణ్ భూషణ్ సింగ్ కాన్వాయ్‌లోని కారు బుధవారం బీభత్సం సృష్టించింది. దీంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, ఒక మహిళ తీవ్రంగా గాయపడింది. ఉత్తరప్రదేశ్‌లోని గొండా జిల్లాలోని కొలోన్‌గంజ్-హుజూర్‌పూర్ రోడ్డులో బైకుంట్ డిగ్రీ కాలేజి వద్ద ఈ దారుణం చోటుచేసుకుంది. కాన్వాయ్‌లోని కారు అదుపు తప్పి రోడ్డుపై వెళుతున్న మోటార్‌సైకిల్‌పైకి దూసుకెళ్లిందని, దీంతో బైక్‌పై ఉన్న రెహాన్ ఖాన్ (17), సెహ్జాద్ ఖాన్ (20) అక్కడికక్కడే మృతి చెందారని పోలీసులు తెలిపారు. రోడ్డు పక్కగా వెళ్తున్న సీతా దేవి (60)కు తీవ్రగాయాలయ్యాయి.

మహిళా రెజ్లర్లపై బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డిన ఘటన దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన సంగతి తెలిసిందే.. బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజధానిలో ప్రముఖ రెజ్లర్లు ఆందోళనకు దిగారు. అయినా బిజెపి బ్రిజ్‌భూషణ్‌తో బంధాన్ని తెంచుకోలేదు. ఈ సారి ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపి బ్రిజ్‌భూషణ్‌కు బదులుగా కైసర్‌గంజ్ నుంచి అతన్ని చిన్న కుమారుడు కరణ్ భూషణ్ సింగ్‌ను బరిలోకి దింపింది. బ్రిజ్‌భూషణ్ సింగ్ పెద్ద కుమారుడు ప్రతీక్ భూషణ్ సింగ్ ఇప్పటికే గొండా సదర్ నియోజకవర్గం నుంచి బిజెపి ఎమ్మెల్యేగా ఉత్తరప్రదేశ్ అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కరణ్ సింగ్ డబుల్ ట్రాప్ షూటింగ్‌లో జాతీయ స్థాయి ఆటగాడు. ఎల్ఎల్‌బి డిగ్రీ చదువుకున్నాడు. అలాగే ఆస్ట్రేలియాలో బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమో పూర్తి చేశాడు.

తీరంపై అణు పిడుగు

- న్యూక్లియర్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు కేంద్ర నిర్ణయం
- చర్యల కోసం రాష్ట్రానికి లేఖ

• లోపలి పేజీలో..•

కెఆర్ఎంబి నూతన చైర్మన్‌గా

అశోక్ ఎస్ గోయల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణానది యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) నూతన చైర్మన్‌గా అశోక్ ఎస్ గోయల్ నియమతులయ్యారు. ఈ మేరకు గురువారం కేంద్ర జలశక్తి శాఖ సీనియర్ అధికారి నరిందర్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు. కేంద్ర జలశక్తి శాఖలో సీనియర్ ఇంజనీర్‌గా, అధికారిగా అశోక్ విధులు నిర్వర్తిస్తున్నారు. మెకానికల్ ఇంజనీరింగ్‌లో పట్టా తీసుకున్నారు. ఇప్పటివరకు చైర్మన్‌గా వ్యవహరించిన శివనందన్‌కుమార్ శుక్రవారం పదవీ విరమణ చేయనున్నారు.

దేశంలోనే తొలిసారి పోలియో బాధితుడికి గుండె మార్పిడి

ప్రజాశక్తి - హైదరాబాద్

దేశంలోనే తొలిసారిగా పోలియో బాధితుడికి ఎల్‌బినగర్ కామినేని ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా గుండెమార్పిడి శస్త్రచికిత్స చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన 45 ఏళ్ల భాస్కర్ వృత్తిరీత్యా టైలర్. అతడు తీవ్రమైన గుండెవ్యాధితో బాధపడుతున్నారు. పాక్షిక పోలియో కారణంగా ఆయన పరిస్థితి మరింత విషమించింది. దాంతో ఎల్‌బినగర్ కామినేని ఆస్పత్రికి రాగా.. ఇక్కడి గుండెమార్పిడి విభాగాధిపతి, కన్సల్టెంట్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ విశాల్ వి. ఖంటే, కన్సల్టెంట్ హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్, కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ రాజేశ్ దేశ్‌ముఖ్ తదితరులతో కూడిన బృందం ఈ అసాధారణ శస్త్రచికిత్సను విజయవంతం చేసింది. 'ఆస్పత్రిలో ఉన్న అత్యాధునిక వైద్య సదుపాయాల సామర్థ్యాన్ని ఇది నిరూపించింది. బ్రెయిన్ డెడ్ అయిన ఒక వ్యక్తి గుండెను దానం చేసేందుకు ఆయన కుటుంబసభ్యులు ముందుకు రాగా, భాస్కర్ పాత గుండెను తీయడం, కొత్తదాన్ని అమర్చడం, దానికి రక్తనాళాలు, ఇతర నరాలను అత్యంత కచ్చితత్వంతో అనుసంధానించడం ఇదంతా చాలా సంక్లిష్టమైన ప్రక్రియ. ఇది మాకు అసాధారణ విజయం.' అని కామినేని ఆస్పత్రుల సిఒఒ డాక్టర్ గాయత్రీ కామినేని తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో పలు విభాగాల డాక్టర్లు రాజేశ్ దేశ్‌ముక్, సురేష్‌కుమార్ ఎసంపల్లి, రవళి సాడే సహా సుశిక్షితులైన ఐసియు సిబ్బంది, నర్సింగ్ బృందం కీలక పాత్ర పోషించారన్నారు.

వెబ్‌సైట్‌లో తెలంగాణ లాసెట్ హాల్‌టికెట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని న్యాయ కళాశాలల్లో లా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్ రాతపరీక్ష వచ్చేనెల మూడున జరగనుంది. ఈ మేరకు లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లాసెట్ హాల్‌టికెట్లు https://lawcet.tsche.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయనీ, అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల మూడో తేదీన మూడున రాతపరీక్షలుంటాయని తెలిపారు. అదేరోజు ఉదయం తొమ్మిది నుంచి 10.30 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి రెండు గంటల వరకు రెండు విడతల్లో, అదేరోజు సాయంత్రం నాలుగు నుంచి 5.30 గంటల వరకు లాసెట్ (ఐదేండ్లు, పీజీలాసెట్) నిర్వహిస్తామని పేర్కొన్నారు. మూడేండ్ల లా కోర్సుకు 36,079 మంది, ఐదేండ్ల లా కోర్సుకు 10,197 మంది, పీజీలాసెట్‌కు 4,408 మంది కలిపి 50,684 మంది అభ్యర్థులు లాసెట్‌కు దరఖాస్తు చేశారని వివరించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

పెద్దలకిస్తేనే ఫ్రీ హోల్డ్

(మొదటిపేజీ తరువాయి)

భీమిలి మండలం అన్నవరం, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో కూడా ఇటువంటి భూబాగోతాలు జరిగినట్టు స్థానికులు చెప్పారు. దాదాపు అన్నిచోట్లా ఆర్డినెన్స్ వల్ల లాభపడాల్సినవారి జాబితా బయటపెట్టకుండా ముందుస్తుగా ఒప్పందాలు కుదుర్చుకున్నట్టుగా సమాచారం. విజయయనగరం జిల్లాలో 2003 సంవత్సరానికి ముందు ఇచ్చిన 6,500 ఎకరాల అసైన్డ్ భూములకు గాను ఇప్పటి వరకు 2,500 ఎకరాలకు మాత్రమే కలెక్టర్ ఫ్రీహోల్డ్ ఇచ్చినట్టు తెలిసింది. ఆ వివరాలను కూడా పూర్తిగా బహిరంగ పరచలేదు.

రైతులకు ఏమని చెప్పారంటే....

'20ఏళ్ల దాటి సాగులోవున్న అసైన్డ్ భూములకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేస్తున్నమాట వాస్తవమే. కానీ, మీ భూములకు అందుకు తగిన రికార్డులు ఉన్నాయో లేవో. అందుకే మీ పేర్లు అధికారులు వెల్లడించలేదు. పేర్లు లేనప్పుడు మీకు పట్టాలు ఎలా వస్తాయి. మాకు ఇచ్చేస్తే మేము ఏదో ఒకలాగా అధికారులను మేనేజ్ చేసుకుని పట్టాలు తెచ్చుకుంటాం' అని రైతులకు పెద్దల బినామీలు చెప్పారు. దీనికోసం ఎకరాకు రూ.50లక్షల నుంచి రూ.70లక్షల వరకు అవుతుందని, రైతులకు ఇస్తున్న మొత్తంతో కలిపి ఎకరాకు రూ.80లక్షల నుండి కోటి వరకు అవుతుందని వారు చెప్పినట్లు స్థానికులు అంటున్నారు.

లబ్ధి ఎవరికి?

ఈ అసైన్డ్ ల్యాండ్ సెటిల్‌మెంట్లలో భూములు కొనుగోలు చేయడానికి వచ్చిన బినామీలు వైసిపి ప్రభుత్వంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన ఇద్దరు ప్రముఖుల పేర్లు చెప్పుకుంటూ గ్రామాల్లో తిరిగారని స్థానికులు అంటున్నారు. ఈ విషయమై అక్కడ చర్చ సాగుతోంది. అధికారపార్టీలో కీలకమైన నాయకులు కనుక ఉన్నతాధికార్లు కూడా వారికి అన్ని విధాల సహకరించారని కొందరు గ్రామస్థాయి నాయకులు చెప్పారు. పెద్దల బినామీలకు అమ్మేందుకు ఒప్పందం చేసుకున్న వారి భూములు మాత్రమే ఫ్రీహోల్డ్ చేయడంలో వారి పాత్ర ఉందని అంటున్నారు. అయితే, 'పెద్దల వ్యవహారాలు మా వరకు ఏం తెలుస్తాయి? అమరావతి స్థాయిలో వారి మధ్య ఏమి ఉన్నాయో?'అని మరి కొందరు అన్నారు.

తీరంపై అణు పిడుగు

- న్యూక్లియర్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు కేంద్ర నిర్ణయం
- చర్యల కోసం రాష్ట్రానికి లేఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలోని తీర ప్రాంతంలో న్యూక్లియర్ అణువిద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్లాంటును ఎక్కడ ఏర్పాటు చేయాలన్న అంశాన్ని నిర్ణయించడంతో పాటు, భూమి కేటాయింపు, ఇతర పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకే కేంద్ర అణువిద్యుత్ శాఖ నుండి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ అందింది. కేంద్ర అణు విద్యుత్ శాఖ పరిధిలోని తమిళనాడు రాష్ట్రం కల్పక్కంలోని భారతీయ నభికియ విద్యుత్ నిగమ్ నుంచి అందిన లేఖను రాష్ట్ర ప్రభుత్వం ఇంధన శాఖకు పంపడంతో కేంద్రం సూచించిన దిశలో చర్యలు కూడా ప్రారంభమయ్యాయి.

అణు విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించడం, భూమిని కేటాయించడమే తదుపరి చర్యలన్న అభిప్రాయం అధికార వర్గాల్లో వ్యక్తమవుతోంది. తీర ప్రాంతంలో అయితే ప్లాంటు ఏర్పాటుకు 625 హెక్టార్ల భూమి సరిపోతుందని లేఖలో పేర్కొన్నారు. అదే, మైదాన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలంటే 960 హెక్టార్ల దాకా భూమి అవసరమవుతుందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తీర ప్రాంతంలో భూమిని గుర్తించాలని లేఖలో సూచించారు.

మార్గదర్శకాలతో ఆందోళన

ఈ ప్రాంత ఎంపిక కోసం సూచించిన మార్గదర్శకాలే ఆందోళన కలిగిస్తున్నాయి. ప్లాంట్‌కు కావాల్సిన ముడిసరుకు, ఇతర రవాణా సౌకర్యాల కోసం విమానాశ్రయాలు, మిలటరీ స్థావరాలు వంటివి కేవలం 16 కిలోమీటర్ల దూరంలోపే ఉండేలా స్థలాన్ని సూచించాలని కేంద్రం పేర్కొంది. అనునిత్యం ప్రయాణీకుల రాకపోకలు ఉండే విమానాశ్రయాలు, తీర ప్రాంత భద్రతకు కీలకమైన డిఫెన్స్ స్థావరాలకు దగ్గరలో అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుచేయాలని మార్గదర్శకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పారిశ్రామిక, రసాయనాల గోదాములు, పేలుడు పదార్థాల నిర్వహణ వంటివి మాత్రం 16 కిలోమీటర్లకన్నా ఎక్కువ దూరంలో ఉండాలని అందులో పేర్కొన్నారు.

భూకంప జోన్లపైనా

అణువిద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటుచేసేందుకు భూకంపాలు సంభవించే జోన్-5లోని ప్రాంతాలు వద్దని నిర్దేశించింది. అయితే రాష్ట్రంలో అనేక ప్రాంతాలు జోన్-2, జోన్-3లో ఉన్నాయి. ఇటీవల కాలంలో భూకంపాలు లేకపోయినప్పటికీ గత చరిత్రలో మాత్రం అనేక ఘటనలు సంభవించిన దాఖలాలు ఉన్నాయి.విద్యుత్ ప్లాంట్‌కోసం రోడ్, రైలు సౌకర్యాలు దగ్గరలో ఉండాలని కూడా పేర్కొన్నారు.

భారీ నీటి అవసరాలు


అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే పెద్ద మొత్తంలో నీటి అవసరాలు ఉంటాయని చెబుతున్నారు. తీర ప్రాంతాల్లో ఈ ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తే గంటకు 4.50 లక్షల క్యూబిక్ మీటర్ల సముద్ర నీరు అవసరమౌతుందని అంటున్నారు. అదే మైదాన ప్రాంతాల్లో అయితే గంటకు 18 వేల క్యూబిక్ మీటర్ల నీరు అవసరమవుతుందని చెబుతున్నారు. ప్లాంట్‌లోని నివాస ప్రాంతాల అవసరాలకు మరో 55 క్యూబిక్ మీటర్ల నీరు కావాల్సి ఉంటుంది.

ఓటమికి కారణాలు వెతుక్కుంటున్నారు

- ఇసిపై వైసిపి నాయకుల విమర్శలపై చంద్రబాబు
- కౌంటింగ్ ఏర్పాట్లపై సీనియర్ నాయకులతో చర్చలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ఓటమి ఖాయమైందని, అందుకనే కారణాలు వెతుక్కునే పనిలో నాయకులు ఉన్నారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ఓటమి చెందితే ఏమి చెప్పాలో తెలియక ఎన్నికల సంఘాన్ని బూచిగా చూపెడుతున్నారని విమర్శించారు. కౌంటింగ్ సమయంలో ఘర్షణలు సృష్టించే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా నాయకులు, ఏజెంట్లు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అమెరికా నుండి తిరిగి వచ్చిన తరువాత హైదరాబాద్‌లోని తన నివాసంలో సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. అలాగే నేరుగా వీడియో కాన్ఫరెన్స్ కూడా నిర్వహించారు. కౌంటింగ్ సరళిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ల సమావేశం అవ్వాలని నిర్ణయించారు. జూన్ ఒకటో తేదీన జోనల్ స్థాయిలో ఎలక్షన్ ఏజెంట్లకు శిక్షణ ఇవ్వాలని నేతలను ఆదేశించారు.



వీటికి సంబంధించి వెంటనే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్ రోజు బందోబస్తుపై ఎన్నికల సంఘం, డిజిపికి లేఖ రాయాలన్నారు. 175 నియోజకవర్గాలకు 120 మంది పరిశీలకులను నియమించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేయాలన్నారు. అలాగే కీలకమైన పోస్టల్ బ్యాలెట్ల విషయంలో ఏజెంట్లు, నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం నాడు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, బిజెపి నేతలు కలిసి చర్చించుకునే అవకాశం ఉందని తెలిసింది. ఎన్నికల అనంతరం హింస జరిగిన ప్రాంతాల్లో నాయకులు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, రక్షణ అంశాలపై పోలీసు శాఖను ప్రత్యేకంగా కోరాలని అక్కడి పార్టీ నాయకులకు సూచించారు. వైసిపి నాయకులకు ఓటమి అర్థమైందని, జూన్ 4న స్పష్టంగా తెలుస్తుందని, రెచ్చగొట్టే అంశాలపై అందరూ జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఏజెంట్లు లేకుండా చేయాలనే ఉద్దేశంతో పెద్దయెత్తున కేసులు నమోదు చేశారని, కీలకమైన ప్రాంతాల్లో కౌంటింగ్ ముందురోజు కూడా కేసులు నమోదు చేయించి బెదిరింపులకు దిగే అవకాశం ఉందని, అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

18 నెలల శిశువుకు సంక్లిష్ట కణితి తొలగింపు

- మెడికవర్ హాస్పిటల్ వైద్యుల వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

నడవలేకపోతున్న 18 నెలల శిశువుకు న్యూరోమానిటరింగ్‌ని ఉపయోగించి తలకి వెన్నెముకకి మధ్యలో మెడ మీద ఉన్న సంక్లిష్ట కణితిని తొలగించి శిశువు నడిచేటట్లు చేశామని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు తెలిపారు. వెన్నెముక నుండి తలకు మధ్యలో సుమారు ఐదు నుండి ఆరు సెంటీమీటర్ల దూరంలో ఉన్న కణితి కారణంగా 18 నెలల శిశువు గత ఎనిమిది నెలలుగా ఏడవడం, తల తిప్పకపోవడం, తీవ్రమైన కాలు నొప్పి, నడవలేని స్థితి, శ్వాసతీసుకోలేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతూ ఉందని వైద్యులు తెలిపారు. శిశువుకు క్లిష్టమైన మెడ భాగంలో కణితి ఉందని గుర్తించడం జరిగిందని మెడికవర్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ న్యూరోస్పైన్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఇది క్లిష్టమైన ప్రదేశంలో ఉండటంతో పాటు ఖచ్చితత్వంతో కూడుకుందన్నారు. సర్జరీ న్యూరోమానిటరింగ్ పద్ధతులను ఉపయోగించి కణితిని పూర్తిగా తొలగించేలా శస్త్ర చికిత్సను నిశితంగా ప్లాన్ చేసి చేశామన్నారు. శస్త్రచికిత్స జరిగిన రెండవ రోజు నుంచే శిశువు పరిస్థితి మెరుగు పడిందన్నారు.

రూ.107.96 కోట్ల నగదు స్వాధీనం

- 7,305 మంది అరెస్ట్
- ఎన్నికల ప్రక్రియపై డిజిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల ప్రక్రియ సందర్భంగా రాష్ట్రంలో 107.96 కోట్ల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అక్రమంగా డబ్బు, మద్యం తరలింపులకు సంబంధించి మొత్తం 7,305 మందిని అరెస్ట్ చేసినట్లు, 3,466



వాహనాలను సీజ్ చేసినట్లు ఈ ప్రకటనలో ఆయన వివరించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుండి పోలింగ్ రోజు దాకా డబ్బు అక్రమరవాణా, మద్యం, డ్రగ్స్, గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. వాణిజ్యపన్నులశాఖ, రవాణాశాఖ, రెవెన్యూ తదితర శాఖల సమన్వయంతో పోలీస్ శాఖ పకడ్బందీగా వ్యవహరించినట్లు తెలిపారు. 2019 ఎన్నికల్లో నగదు కేవలం రూ.41.80 కోట్లు అయితే ఇపుడు ఏకంగా రూ.107.96 కోట్లను సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే మద్యం విలువ నాడు కేవలం రూ.8.07 కోట్లు అయితే ఇపుడు ఏకంగా రూ.58.7 కోట్ల విలువైప మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే 2019 ఎన్నికల సందర్భంగా రూ.5.04 కోట్ల విలువ చేసే డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంటే ఇపుడు రూ.35.61 కోట్లు స్వాధీనం చేసుకొని 1,730 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 2019లో రూ.10.63 కోట్ల విలువైన బంగారు, వెండిని స్వాధీనం చేసుకుంటే ఇప్పుడు రూ.123.62 కోట్ల సొత్తును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఢిల్లీ భగభగలకు కారణాలేంటి..!

న్యూఢిల్లీ :రాజస్థాన్ నుండి వీచే వేడిగాలులు మొట్టమొదటగా తాకేది ఢిల్లీ శివారు ప్రాంతాలేనని అందువల్ల ఇక్కడ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఐఎండి ప్రాంతీయ విభాగ అధిపతి కుల్‌దీప్ శ్రీవాత్సవ మీడియాతో చెప్పారు. అసలే వాతావరణ పరిస్థితులు అత్యంత దుర్భరంగా వున్నాయని, దానికి తోడు రాజస్థాన్ నుండి ఆ వేడి గాలులు కూడా తోడవడంతో ఢిల్లీలోని కొన్ని ప్రాంతాలు విలవిల్లాడిపోయాయని చెప్పారు.

ఎలాంటి నిర్మాణాలు లేని ఖాళీ బహిరంగ ప్రదేశాల్లో రేడియేషన్ బాగా ఎక్కువగా వుంటుందని, నేరుగా సూర్యరశ్మి నేలను తాకడం, ఎక్కడా నీడన్నది లేకపోవడంతో ఇటువంటి ప్రాంతాలు అసాధారణమైన వేడిమిని నమోదు చేస్తాయని స్కైమెట్ వెదర్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ మహేష్ పలావత్ చెప్పారు. పశ్చిమ ప్రాంతాల నుండి బలమైన గాలులు వీయడం, పైగా నగర శివార్లు కావడంతో ముందుగా ఈ ప్రాంతాలు ప్రభావితమవుతాయని, విపరీతంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయని చెప్పారు.

వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరి

ఉత్తర, మధ్య భారత దేశంలోని పలు ప్రాంతాలు నిప్పుల కొలిమిలా మారాయి.. రాజస్థాన్‌లోని చురులో, హర్యానాలోని సిర్సాలో ఉష్ణోగ్రతలు 50డిగ్రీలు దాటాయి. చురులో 50.5, సిర్సాలో 50.3 డిగ్రీలు నమోదయ్యాయి. ఢిల్లీలో సాధారణం కన్నా ఏకంగా 9డిగ్రీలు అధికంగా నమోదయింది. ఢిల్లీలోని ముంగేష్‌పూర్, నరేలా ప్రాంతాల్లో 49.9, నజఫ్‌గర్‌లో 49.8 డిగ్రీల సెల్సియస్ నమోదైనట్లు ఐఎండి అధికారులు తెలిపారు. బంగాళాఖాతం నుండి తేమతోకూడిన గాలులు వీయడం వల్ల గురువారం నుండి కాస్త వేడి తగ్గే అవకాశం వుందని తెలిపారు.

సోని కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి


- ఆదివాసీ గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పని ప్రదేశంలో హత్యకు గురైన సోని కుటుంబానికి ఉపాధి హామీ చట్ట ప్రకారం రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి అప్పలనర్స, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. చింతపల్లి మండలం, పెడకొండలో ఉపాధి హామీ కార్మికుడు సోనిపై బాబ్జీ అనే వ్యక్తి బాణం వేయడంతో ఆయన అక్కడికక్కడే మరణించాడు. దాడి చేసిన బాబ్జీని పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకోవాలని, దాడి ఘటనపై సమగ్ర విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.

తెలంగాణ రాష్ట్ర గీతం నిడివి 2 నిమిషాల 30 సెకన్లు

- భావం మారకుండా కీరవాణి స్వరకల్పన
- తెలంగాణ అధికారిక చిహ్నానికి తుదిరూపం
- గీత రచయిత, చిత్రకారులతో సిఎం సమీక్ష
- కాకతీయ తోరణానికి మార్పులు సూచించిన రేవంత్
- జూన్ 2న ఆవిష్కరణ



సమీక్షలో పాల్గొన్న తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, ఇతర నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర గీతం "జయ జయహే తెలంగాణ" గీతాన్ని పలు మార్పులతో ఖరారు చేశారు. తెలంగాణ, అస్థిత్వం, ఆత్మగౌరవం, ప్రతిబింబించేలా 6 నిమిషాల నిడివితో ప్రముఖ గేయ రచయిత అందెశ్రీ రాసిన ఈ గీతాన్ని రెండు నిమిషాల 30 సెకన్లకు కుదించారు. తెలంగాణ ఔన్నత్యం, భావం, భావోద్వేగం దెబ్బతినకుండా ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా సులువుగా రూపొందించారు. ప్రముఖ సంగీత దర్శకులు కీరవాణి ఈ గీతానికి స్వరకల్పన చేశారు. అలాగే తెలంగాణ అధికారిక చిహ్నం తుది రూపం ఖరారైంది. ప్రముఖ చిత్రకారులు రుద్ర రాజేశం తయారు చేసిన 12 చిహ్నాల్లో ఒక దాన్ని ఎంపిక చేశారు. బుధవారం హైదరాబాద్‌లో అధికారిక చిహ్నం, రాష్ట్ర గీతంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఎంపిక చేసిన చిహ్నంలో కొన్ని మార్పులు చేయాలని సిఎం వారికి సూచించారు. గత చిహ్నంలో రాజరిక ముద్రలకు ప్రతీకగా ఉన్న, కాకతీయ తోరణాన్ని మార్చి ప్రత్యామ్నాంగా ప్రజాస్వామ్యం, తెలంగాణ ఉద్యమం, త్యాగధనుల బలిదానాలు ప్రతిబింబించేలా కొత్త రూపాన్ని చేర్చనున్నారు. చార్మినార్, మూడు సింహాలు, జాతీయ జెండాలోని మూడు రంగులు మొదలైనవి యధాతథంగా ఉండనున్నాయి. తెలంగాణ ఏర్పడి పదేండ్లు గడుస్తున్న నేపథ్యంలో జూన్ 2న సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర చిహ్నం, రాష్ట్ర గీతం, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జయజయహే గేయ రచయిత అందెశ్రీ, సంగీత దర్శకులు కీరవాణి, తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, అద్దంకి దయాకర్, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, జెఎసి నేత రఘు తదితరులు పాల్గొన్నారు.

యువ కార్మికులు పోరాటాల్లోకి రావాలి



ప్రజాశక్తి -ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో యువ కార్మికులు అధికంగా పాల్గొనాలని పోరాట కమిటీ నాయకులు శ్రీనివాసరావు, డిసిహెచ్ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి 1203వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరంలో స్టీల్‌ప్లాంట్ ఎస్‌ఎంఎస్ విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాన్ని కొనసాగించాలన్నారు. ఎండలను సైతం లెక్కచేయకుండా దీక్షలో పాల్గొంటున్న కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరిగితే ముఖ్యంగా యువ కార్మికులు నష్టపోతారని, తద్వారా వారి భవిష్యత్తు అంధకారం అవుతుందని తెలిపారు.

కౌంటింగ్‌లో అప్రమత్తం : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. రాష్ట్రంలో మరోమారు వైసిపి అధికారంలోకి రానుందని, జూన్ 9న జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లతో బుధవారం వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. పోస్టల్ బ్యాలెట్ల విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి టిడిపి వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వారికి అనుకూలంగా నిర్ణయాలు వచ్చేలా పనిచేస్తోందన్నారు. ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలు పట్ల ఏజెంట్లు పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర కార్యాలయం ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, రిటైర్డు ఆర్‌డిఒ ప్రభాకర్ ఉన్నారు.

సిఇసికి ఫిర్యాదు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా పోస్టల్ బ్యాలెట్ వ్యాలిడిటిపై ఇచ్చిన మెమోను ఉపసంహరించాలని వైసిపి కోరింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు వైసిపి ఎంపి నిరంజన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటు విషయంలో భారత ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మెమో ఇచ్చారని ఫిర్యాదు చేశారు. స్పెసిమెన్ సంతకాలతో అటెస్టేషన్ ప్రక్రియ ఇసి నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల చెల్లుబాటు విషయంలో ఇసి నిబంధనల మేరకు చర్యలు తీసుకునేలా తక్షణమే రాష్ట్ర సిఇఒ ఇచ్చిన మెమోను సమీక్షించాలని కోరారు.

రాజకీయ నేతలు, జడ్జిల ఫోన్ల ట్యాప్

- ఇందుకోసం 56 మంది పోలీసులతో ప్రత్యేక బృందం
- తెలంగాణ ఎస్ఐబి మాజీ డిఎస్‌పి ప్రణీత్ రావు వాంగ్మూలంలో కీలకాంశాలు వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ప్రణీత్‌రావు

ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో విస్మయకర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. తమకు రాజకీయంగా ఇబ్బందులు కలిగిస్తున్న అన్ని వర్గాల వ్యక్తులపై గత ప్రభుత్వ పెద్దలు ఫోన్ ట్యాపింగ్ అస్త్రాన్ని ఉపయోగించారని ఈ కేసు దర్యాప్తులో స్పష్టమవుతోంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన ఇంటెలిజెన్స్ అదనపు ఎస్‌పిలు భుజంగరావు, తిరుపతన్న...దర్యాప్తులో వెల్లడించిన అంశాలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. ప్రత్యర్థుల వ్యక్తిగత వ్యవహారాలు తెలుసుకోవడం దగ్గరి నుంచి షెటిల్‌మెంట్లు, వ్యాపారులు, రియల్టర్ల నుంచి పెద్దమొత్తంలో వసూళ్లు, ఎన్నికల సమయంలో విపక్ష నేతల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు నిర్వహించడం, రాజకీయ ప్రత్యర్థుల వ్యూహాలకు చెక్ పెట్టడం వంటి చట్ట వ్యతిరేక పనులు చక్కబెట్టేందుకు పోలీసులే ఒక బృందంగా ఏర్పడటం విశేషం. పలువురి న్యాయమూర్తుల ఫోన్లు కూడా ట్యాప్ చేసినట్లు ఇదే కేసులో మరో నిందితుడు, ఎస్ఐబి మాజీ డిఎస్‌పి ప్రణీత్ రావు దర్యాప్తు అధికారులకు వెల్లడించినట్లు తెలిసింది. సుమారు 1200 మంది ఫోన్లు ట్యాప్ చేసినట్లు ప్రణీత్‌రావు అంగీకరించినట్లు సమాచారం. గత ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు కన్వర్జెన్స్ ఇన్నోవేషన్ ల్యాబ్ సాఫ్ట్‌వేర్ సాయంతో ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడినట్టు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ పర్యవేక్షణ కోసం 17 కంప్యూటర్లను వినియోగించామని, 56 మంది ఎస్‌ఒటి సిబ్బందిని ఏర్పాటు చేశారు. 'ట్యాపింగ్ ఆపివేయాలని అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజే అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు నుంచి ఆదేశాలు అందాయి. ఆయన సూచన మేరకు రికార్డులన్నీ ధ్వంసం చేశాం. ధ్వంసం చేసిన ఆధారాలను నాగోలు, మూసారాంబాగ్ వద్ద మూసీ నదిలో పడేశాం.సిడిఆర్, ఐడిపిఆర్ డేటా మొత్తం కాల్చేశాం. ఫార్మాట్ చేసిన ఫోన్లు, పెన్‌డ్రైవ్‌లను బేగంపేట నాలాలో పడేశాం'. అని దర్యాప్తు బృందానికి ప్రణీత్ రావు తెలిపినట్లు తెలిసింది.

కౌంటింగ్‌పై తీవ్ర ఉత్కంఠ

- గెలుపుపై సొంత సోషల్ మీడియాల్లో ప్రచారం
- ఎన్నికల కమిషన్‌పై నేరుగా విమర్శలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇప్పటి వరకూ జరిగిన అన్ని ఎన్నికల్లోనూ ఎవరు అధికారంలోకి వస్తున్నారో చెప్పగలిగిన రాజకీయ విశ్లేషకులు ఈసారి పూర్తిస్థాయిలో అంచనా వేయలేకపోతున్నారు. ఓటరునాడి కూడా అందుకోలేకపోయారు. ఫలితాలపై ఎవరికితోచిన విధంగా వారు ప్రచారం చేసుకుంటున్నారు. గెలుపు ఎవరిది అనే అంశంపై వైసిపి, టిడిపి కూటమిలో కచ్చితమైన నిర్ధారణకు రాలేకపోతున్నారు. దీంతో ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ నాయకుల్లో తీవ్ర ఉత్కంఠ పెరిగిపోతోంది. ఎక్కడ చూసినా ఇదే అంశంపై చర్చించుకుంటున్నారు. ఎవరికితోచిన వారికి వాళ్లు ఫోన్లు చేసుకుని వారి అంచాలను విని సాంత్వన పొందుతున్నారు. రాష్ట్రంలో తొలిసారి ఇలాంటి ప్రత్యేక పరిస్థితి నెలకొందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జూన్ ఒకటో తేదీన సర్వే అంచనాలు వస్తాయని చెబుతున్నా.. ఇప్పటికే సోషల్ మీడియాలో ఫలితాలను ఎవరికివారు అనధికారికంగా విడుదల చేస్తున్నారు. పేరెన్నికగన్న సంస్థల సర్వేలు ఇంకా బయటకు రాలేదు. 12 సర్వే సంస్థలు ఫలితాలను మాత్రం విడుదల చేశాయి. వాటిల్లో సగం సంస్థలు వైసిపికి, సగం సంస్థలు టిడిపి కూటమికి అనుకూలంగా తీర్పు ఇచ్చాయి. వాటిని చూసిన తరువాత ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఉత్కంఠ మరింత పెరుగుతోంది. ఎన్నికల అనంతరం పర్యటనలకు వెళ్లిపోయిన కార్యకర్తలు, కిందిస్థాయి నాయకులందరూ ఇప్పుడిప్పుడే చేరుకుంటున్నారు. మరోవైపు రెండు పార్టీల నాయకులు ఓటింగు తీరుపైనా, కౌంటింగ్ తీరుపైనా ఎన్నికల సంఘం కేంద్రంగా పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. ఎన్నికల ముందు వరకూ ఎన్నికల సంఘాన్ని వెనకేసుకొచ్చిన వైసిపి ఇప్పుడు పూర్తిగా వ్యతిరేక ప్రకటనలు చేస్తోంది. ఉద్దేశపూర్వకంగానే టిడిపి, బిజెపి, జనసేన కూటమికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య విమర్శించారు. టిడిపి కూడా అదే తరహా విమర్శలు చేస్తోంది. వైసిపి నాయకులు దౌర్జన్యాలకు పాల్పడితే పట్టించుకోలేదని, టిడిపి నాయకులపైనే కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తం చేసింది. రెండు పార్టీల నాయకులూ ఎన్నికల సంఘాన్ని కేంద్రంగా చేసుకుని పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. కౌంటింగ్ రోజు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఎన్నికల సంఘం దీనికోసం సరిగ్గా ఏర్పాట్లు చేయడం లేదని వైసిపి నాయకులు ప్రత్యక్షంగా విమర్శలు గుప్పించారు. టిడిపి నాయకులు కౌంటింగ్ ఏర్పాట్లపై జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేయడంతో నాయకుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మరోవైపు సోషల్ మీడియాలో ఎవరికివారు తమదే గెలుపంటూ ఎవరికితోచిన ప్రచారం వారు చేసుకుంటున్నారు. ఒకవైపు ఆందోళనతో విమర్శలు చేస్తూ మరోవైపు గెలుపు తమదేనంటూ ప్రచారం చేసుకుంటుండటంపై కార్యకర్తలు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.

మాచర్ల నుంచి పిన్నెల్లిని బహిష్కరించాలి

- 'పిన్నెల్లి పైశాచికం' పుస్తకావిష్కరణలో టిడిపి నేతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వం అండ చూసుకుని మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరాచకాలు, దౌర్జన్యాలు, దోపిడీ విధానాలు పెరిగిపోయాయని, తక్షణమే ఆయన్ను మాచర్ల నుంచి బహిష్కరించాలని టిడిపి నేతలు డిమాండ్ చేశారు. పిన్నెల్లి పైశాచికం పేరుతో టిడిపి నేతలు బుధవారం టిడిపి కార్యాలయంలో పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా దేవినేని ఉమామహేశ్వరరావు, బుద్ధా వెంకన్న, అడ్వకేట్ కిషోర్, పిల్లి మాణిక్యాలరావు, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, ధారూనాయక్, మాట్లాడుతూ.. మాచర్లలో పెట్రేగిన వారికి త్వరలోనే బుద్ధి చెబుతామన్నారు. సిఎం జగన్ అండ చూసుకునే పిన్నెల్లి దుర్మార్గాలు చేశారన్నారు. పిన్నెల్లి జీవితమంతా నేర చరిత్రేనని విమర్శించారు.

విజయవాడలో అతిసార విజృంభణ

- పది రోజుల్లో నలుగురు మృతి
- వందమందికిపైగా బాధితులు
- వైద్య శిబిరాల ఏర్పాటు
- బాధిత కుటుంబాలను సిపిఎం నేతల పరామర్శ



మొగల్రాజపురం ప్రాంతంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు బాబూరావు, కృష్ణ, మురహరి, క్రాంతి తదితరులు

ప్రజాశక్తి- విజయవాడ

విజయవాడలోని మొగల్రాజపురంలో అతిసార విజృంభించి గత పది రోజుల్లో నలుగురు మరణించారు. వంద మందికిపైగా ఈ వ్యాధి బారినపడ్డారు. వారిలో 50 మందికిపైగా పలు ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. కలుషిత నీటి వల్లే అతిసార ప్రబలిందని చెప్తున్నారు.

విజయవాడ మొగల్రాజపురంలో గత పది రోజులుగా పలువురు వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఆరు రోజుల క్రితం శిఖా ఇందిరా (42), మూడు రోజుల క్రితం కాకార్లమూడి ఇందిరా (55), వల్లూరి దుర్గారావు (46), మంగళవారం ఇడుపుల కల్యాణ్ (26) మరణించారు. సిపిఎం మొగల్రాజపురం కార్యాలయంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని, విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో 30 పడకలతో ప్రత్యేక వార్డును అధికారులు ఏర్పాటు చేశారు. ఏడుగురు వైద్యులతోపాటు 30 మంది సిబ్బంది వైద్య సేవలందిస్తున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ (విఎంసి) కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎన్‌టిఆర్ జిల్లా డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ ఎం.సుహాసిని పర్యవేక్షణలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచే చర్యలు చేపట్టారు.



సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో బాధితులు

రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలి : సిపిఎం

అతిసారతో మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని, బాధితులకు సాయం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని కోరారు. అతిసార బాధితులను బుధవారం సిపిఎం నేతలు పరామర్శించారు. విఎంసి, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ బాధితుల వైద్య ఖర్చుల కోసం ఒక్కొక్కరికీ రూ.25 వేల చొప్పున ప్రభుత్వం సాయం చేయాలని డిమాండ్ చేశారు.

మంచినీటి నమూనాలు సేకరించాం : ఎన్‌టిఆర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి సుహాసిని

పలు ప్రాంతాల్లో మంచినీటి నమూనాలను సేకరించామని ఎన్‌టిఆర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. వీటిని పరీక్షల నిమిత్తం గుంటూరులోని ల్యాబ్‌కు పంపామని చెప్పారు. వీటి ఫలితాలు వచ్చిన అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఇది అతిసార అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదన్నారు. కాగా, నీటి సరఫరాలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు సిబ్బందికి నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

నేడు సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

- జయప్రదానికి రాష్ట్ర కమిటీ పిలుపు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు కోరారు. రాష్ట్రంలోని సిఐటియు కార్యాలయాల వద్ద పతాకావిష్కరణ జరపాలని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) 1970 మే 30న కలకత్తాలో ఆవిర్భవించింది. భారతదేశంలో వర్గ రాజకీయ సిద్ధాంతాన్ని కాపాడడంలో ఒక చారిత్రాత్మకంగా సిఐటియు ఏర్పడిందని, ఆనాటి నుంచి వర్గ పోరాట సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లడానికి నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. దేశంలో సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలను ఎదుర్కోవడంలో సిఐటియు అగ్రభాగాన ఉందన్నారు. ప్రభుత్వరంగ పరిరక్షణ, ప్రయివేటీకరణ వ్యతిరేక ఉద్యమాలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

రైతులందరికీ నష్టపరిహారం చెల్లిస్తాం

- ఒఎన్‌జిసి అధికారులు

ప్రజాశక్తి - నరసాపురం

ఒఎన్‌జిసి పైపులైన్ వెళ్తున్న భూముల్లో రైతులందరికీ నష్టపరిహారం అందిస్తామని, రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఒఎన్‌జిసి అధికారి ఎం.క్రాంతిప్రసాద్ అన్నారు. ఒఎన్‌జిసి పైపులైన్ పనులను పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం సీతారామపురం సౌత్‌లోని కూనపురెడ్డివారి మెరక గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఒఎన్‌జిసి కెజి ప్రాజెక్టు నుంచి ప్రత్యేక అధికారులు బుధవారం సీతారాంపురం వచ్చారు. గ్రామ సర్పంచ్ దొండపాటి వెంకట్, మాజీ సర్పంచ్ అడబాల అయ్యప్ప నాయుడు, విఆర్ఒ కడలి నాగేంద్రతో కలిసి ఒఎన్‌జిసి అధికారులు రైతులతో మాట్లాడారు. తమ భూములకు నష్ట పరిహారం ఇవ్వకుండా పనులు చేపడితే ఎలా? అని రైతులు ప్రశ్నించారు. రైతులందరికీ న్యాయం చేసిన తర్వాతే పనులు చేపట్టాలని విన్నవించారు. క్రాంతి ప్రసాద్ మాట్లాడుతూ.. రైతుల వివరాలు తీసుకున్నామని, త్వరలో నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.

న్యాయ నిపుణులతో సిఎస్ సంప్రదింపులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖపట్నం జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి అసైన్డ్ భూములు కొనుగోలు చేశారని ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో న్యాయ నిపుణులతో సిఎస్ బుధవారం సంప్రదింపులు జరిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. మూర్తి యాదవ్‌పై న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు వీలుగా గతంలో జాతీయ స్థాయిలో ప్రముఖులపై వివిధ సందర్భాల్లో వచ్చిన ఆరోపణలపై న్యాయపరంగా ఏ విధమైన చర్యలు తీసుకున్నారో అదే రీతిలో న్యాయపరంగా చర్యలు తీసుకుందామని న్యాయ నిపుణులు సిఎస్‌కు వివరించారు. మూర్తి యాదవ్‌కు త్వరలో లీగల్ నోటీసు జారీ చేయనున్నట్లు పేర్కొంది.

భూ దోపిడీలపై సమగ్ర విచారణ

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం డిమాండ్

ప్రజాశక్తి - విశాఖపట్నం

విశాఖ, భోగాపురం చుట్టుపక్కల 800 ఎకరాల అసైన్డ్ భూములను పేద రైతుల నుంచి అక్రమంగా రాయించుకున్నట్లు పత్రికల్లో వస్తున్న కథనాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విశాఖను రాజధానిగా చేస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో అక్రమార్కుల భూదందాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుందని పేర్కొన్నారు. అధికార అండతో వేల కోట్ల రూపాయల విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, విశాఖపట్నం అభివృద్ధి అంటే ప్రభుత్వ భూములను కబ్జాలు చేయడమేనా? అని ప్రశ్నించారు. విశాఖపట్నంలో రుషికొండ, దబ్బంద, కుసులవాడ ప్రాంతాల్లో ఉన్న వందల ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయని వివరించారు. రోజు పత్రికల్లో, మీడియాల్లో అనేక కథనాలు వస్తున్నాయని, ప్రభుత్వ, పేదల భూములను కాపాడాల్సిన ప్రభుత్వ పెద్దలే భూ కబ్జాదారులకు సహకరించారని తీవ్రంగా దుయ్యబట్టారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపైనే భూ కుంభకోణాల ఆరోపణలు వస్తే వాటిపై విచారణ జరపాల్సిన విశాఖ జిల్లా కలెక్టర్ అలాంటివి జరగలేదని చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై నాడు చంద్రబాబు నేడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు సిట్‌లను వేసి చేతులు దులుపుకున్నాయని విమర్శించారు. తమ అనుయాయులను రక్షించుకునేందుకే సిట్ నివేదికలను బహిర్గతం చేయలేదనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమౌతోందన్నారు.

కడప నుంచి ఎవరో వచ్చి శ్రీకాకుళం జిల్లా, చుట్టుపక్కల ప్రాంతాల్లో భూదందాలకు పాల్పడుతున్నారని వైసిపి నేత, మంత్రి ధర్మాన ప్రసాదరావు గతంలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం జరుగుతున్న భూ వ్యవహారాలపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ల్యాండ్ పూలింగ్ పేరుతో పేదల సాగులో ఉన్న అసైన్డ్ భూములను లాక్కొని మోసం చేశారని తెలిపారు. అర్బన్ ఎగ్లామిరేషన్ పేరుతో ఏళ్లతరబడి విశాఖ నగరం చుట్టూ ఉన్న మండలాల్లో పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వలేదని, అలాంటిది పేదల సాగులో ఉన్న భూములను దర్జాగా అక్రమాలకు పాల్పడుతున్న ల్యాండ్ మాఫియాపై ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ భూ వ్యవహారాలపై సమగ్ర విచారణ చేయించాలని, అక్రమార్కులను శిక్షించి, ప్రభుత్వ, ప్రజల భూములు కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాగ్రహం చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

'కరాటం కృష్ణమూర్తి' మిగులు భూముల్లో భూ పోరాటం

- పేదలతో కలిసి కొబ్బరి మొక్కలు నాటిన వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

కరాటం కృష్ణమూర్తి ప్రాజెక్టు మిగులు భూములను పేదలకు పంచాలని, ప్రాజెక్టు భూములు ఆక్రమించిన భూస్వాములపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం, చిన్నవారిగూడెం గ్రామాల్లోని ఎర్రకాలువ ప్రాజెక్టు మిగులు భూముల్లో పేదలతో కలిసి కొబ్బరి మొక్కలు నాటి భూ పోరాటం చేపట్టారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కరాటం కృష్ణమూర్తి ఇరిగేషన్ ప్రాజెక్టు నిమిత్తం 40 సంవత్సరాల క్రితం జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం మండలాల్లో వేలాది ఎకరాలు సేకరించారని, ప్రాజెక్టు పూర్తి అయిన తర్వాత 1500 ఎకరాల భూమి ఖాళీగా ఉందని, ఆ భూములను భూస్వాములు ఆక్రమించారని తెలిపారు. 20 సంవత్సరాల నుంచి భూములను భూస్వాములు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారన్నారు. పశు పోషణ కోసం పచ్చగడ్డి, జాడు మేత పోసుకొని జీవనం సాగించేందుకు పేదలకు సాగుభూములు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు, ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేదని విమర్శించారు. దీంతో పేదలతో కలిసి ఈ భూముల్లో కొబ్బరి మొక్కలు నాటామని చెప్పారు. ఈ మొక్కలను తొలగించాలని భూస్వాములు చూస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొబ్బరి మొక్కలు నాటిన పేదలు, వ్యకాసం నాయకులు

తాగునీటి విలువ తెలిపేలా

పాఠ్యాంశాల్లో ప్రత్యేక చాప్టర్

- సోలార్ విద్యుత్తుతో రక్షిత మంచినీటి సరఫరా
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తాగునీటికి సంబంధించి పాఠ్యాంశాల్లో ఒక ప్రత్యేక చాప్టర్‌ను పెట్టాల్సిన ఆవశ్యకత ఉందని, ఫలితంగా విద్యార్థులతోపాటు ప్రతిఒక్కరికీ తాగునీటి సంరక్షణ ఆవశ్యకతపై అవగాహన ఏర్పడి నీటిని పొదుపు చేస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. తాగునీటి సోర్సులను జియో ట్యాగింగ్‌తో అనుసంధానం చేసే అంశంపైనా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గతేడాది డిసెంబరు 27 నుంచి 29 వరకు ఢిల్లీలో జరిగిన 3వ జాతీయ చీఫ్ సెక్రటరీల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై బుధవారం సచివాలయం నుంచి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పగటి సమయంలో వివిధ సింగిల్ విలేజ్ రక్షిత మంచినీటి సరఫరా పథకాల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు వీలుగా కార్యాచరణ చర్యలు చేపట్టాలని రక్షిత మంచినీటి సరఫరా, మున్సిపల్‌శాఖ అధికారులను సిఎస్ ఆదేశించారు. సిఎస్‌ల సమావేశంలో చర్చించిన అంశాలపై సంబంధిత శాఖలు సకాలంలో చర్యలు తీసుకుని వెంటనే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. విద్యుత్తు, తాగునీరు, వైద్య, ఆరోగ్యం, విద్యాశాఖలకు సంబంధించి సిఎస్‌ల సమావేశంలో చర్చించిన థీమ్ అంశాలపై చర్యల నివేదికను నీతి ఆయోగ్‌కు సమర్పించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో త్వరితగతిన సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని జవహర్‌రెడ్డి ఆదేశించారు. జులై నెలలో నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరగనుందని, ఆ సమావేశంలో గత సిఎస్‌ల సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు గురించి సమీక్షించనున్నారని తెలిపారు. ఐదు విభాగాలకు సంబంధించి 117 యాక్షనబుల్ పాయింట్స్‌పై ఆయా శాఖలు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. కాగా, ఇప్పటి వరకు 43 అంశాలపై చర్యలు తీసుకోగా, మరో 60 అంశాలకు సంబంధించి చర్యలు ప్రారంభించారని, 17 అంశాలపై ఇంకా చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. మరో 7 అంశాలపై ఆయా శాఖల నుంచి సమాధానాలు రావాల్సి ఉందన్నారు. ఐటి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి 28 అంశాలపై చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను సిఎస్ ఆదేశించారు. వైద్యారోగ్యశాఖకు సంబంధించిన అంశాలపై సమీక్షిస్తూ సమాజం నుంచి క్షయ, టిబి, బోధకాలు వ్యాధులను పూర్తిగా రూపు మాపేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రణాళికాశాఖ కార్యదర్శి గిరిజా శంకర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సంబంధిత శాఖలవారీ అంశాల్లో తీసుకున్న చర్యలను వివరించారు. ఈ సమావేశంలో ఇంధన, వైద్య, ఆరోగ్య, వ్యవసాయ, ఆర్థికశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కె విజయానంద్, ఎంటి కృష్ణబాబు, గోపాలకృష్ణ ద్వివేది, ఎస్ఎస్ రావత్, జలవనరులు, పిఆర్అండ్ఆర్‌డి ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఐటిశాఖ కార్యదర్శి కె శశిధర్ పాల్గొన్నారు.

మార్కెట్ లీడర్ ఎల్ఐసి

ముంబయి : దేశంలో రెండు డజన్ల పైగా బీమా కంపెనీలు వచ్చినప్పటికీ.. ఎల్ఐసి మెజారిటీ వాటాతో ఇప్పటికీ మార్కెట్ లీడర్‌గానే కొనసాగుతోంది. 2023-24 మార్చితో ముగిసిన ఏడాది నాటికి ఎల్ఐసి పరిధిలోని ఆస్తుల విలువ (ఎయుఎం) రూ.51,21,887 కోట్లకు చేరింది. 2022-23 నాటి రూ.43,97,205 కోట్ల విలువతో పోల్చితే ఏడాదిలోనే 16.48 శాతం వృద్ధిని సాధించింది. రూ.51.21 లక్షల కోట్లు.. డాలర్లలో 616 బిలియన్ డాలర్లకు సమానం.

పేదల భూములు లాక్కోడానికే చట్టం

- మాజీ ఐఎఎస్ పి.వి.రమేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పేదల భూములను లాక్కునేందుకు అసైన్డ్ ల్యాండ్ చట్టం 2023 తీసుకొచ్చారని మాజీ ఐఎఎస్ పి.వి.రమేష్ 'ఎక్స్' చేశారు. ఈ చట్టం ద్వారా బలవంతులు, ధనవంతులు భూములు లాక్కునేందుకు ద్వారాలు తెరిచారనీ తీవ్రస్థాయిలో విమర్శించారు. 1953 నుండి భూమిలేని పేదల కోసం లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని అసైన్డ్ చేశారని, అమ్మకానికి కాదనీ తెలిపారు. ఎనిమిది ఎకరాల భూమికి సంబంధించిన ఆరోపణలపై జార్ఖండ్ ముఖ్యమంత్రికి జైలుశిక్ష విధించారని, ఎపిలో వేల ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేసిన రాజకీయ నాయకులు, అధికారులు, కాంట్రాక్టర్ల సంగతేంటని ప్రశ్నించారు. 35/2023 చట్టం పేదలకు ఇచ్చిన భూములను స్వాధీనం చేసుకునేందుకు, భూకబ్జాదారులకు హక్కు కల్పించినట్లు అయిందని తెలిపారు. ఈ చట్టంతోపాటు, ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేయాలని, అక్రమాలపై దర్యాప్తుకు ఆదేశించాలని ఆయన ఎక్స్‌లో కోరారు.

సంపాదకీయం


జల గరళం

ప్రాణాధారమైన తాగునీరు విషతుల్యంగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. రెండు నెలల క్రితం గుంటూరు నగరాన్ని వణికించిన కలుషిత తాగునీటి సమస్య నలుగురి ప్రాణాలను బలిగొంది. ఆ సంఘటన మరచిపోక ముందే తాజాగా విజయవాడలోనూ తాగునీరు కలుషితమయి పదిరోజుల్లో నాలుగురు మృత్యువాత పడినట్లు వస్తున్న వార్తలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. ఈ రెండు సంఘటనల్లోనూ అధికార యంత్రాంగం స్పందన అందుకు తగినట్లు లేకపోవడం విచారకరం! అటు గుంటూరులోనూ, ఇటు విజయవాడలోనూ స్థానిక ప్రజానీకం కలుషిత నీరు సరఫరా అవుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి ముందుగానే తీసుకువెళ్లారు. రెండు చోట్లా ప్రజలు అస్వస్థతకు గురికావడం, ఆస్పత్రుల్లో చేరడం, ప్రాణాలు పోవడం వంటి సంఘటనలు చోటుచేసుకుని, నిర్లక్ష్యపు తీరుపై మీడియాలో దుమ్మెత్తిపోసిన తరువాతే వారిలో కదలిక కనిపించింది. అప్పటికే జరిగిన నష్టాన్ని పూడ్చలేము కదా! ప్రజల నుండి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. జలం గరళంగా మారడంతో గుంటూరు నగరంలో 2018లో ఏకంగా 24 మంది మృతి చెందారు. వేలాది మంది అస్వస్థతకు గురయ్యారు. ఆ సంఘటన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో తాగునీటి వ్యవస్థ తీరుతెన్నులపై ప్రభుత్వం వివరాలు సేకరించింది. కానీ, చర్యలు మాత్రం శూన్యం! ప్రతి ఏడాదీ ఏదో ఒక స్థాయిలో రాష్ట్రంలోని ఏదో ఒక ప్రాంతంలో ఈ తరహా సంఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. అయినా, అధికార యంత్రాంగం పాఠాలు నేర్వకపోవడం దారుణం!

తాజాగా కలుషిత నీటిబారిన పడిన విజయవాడ నగరంలోని 64 డివిజన్లలో సుమారు 1.40 లక్షల మంచినీటి కనెక్షన్లు ఉన్నాయి. తాగునీటిని సరఫరా చేసే పైపులైన్లన్నీ పాతకాలం నాటివి. వీటిలో కూడా డ్రైనేజి పైపులకు ఆనుకుని పోయే పైపులే ఎక్కువ! పైపులకు పెద్ద ఎత్తున లీకేజి సమస్యలు ఉన్నట్లు గతంలోనే గుర్తించారు. 2018 గుంటూరు విషాదం తరువాత అధికార యంత్రాంగం సేకరించిన వివరాల్లో ఈ పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నట్లు తేలింది. దాదాపుగా అన్ని నగరాలు, పట్టణాల్లోనూ మంచినీటి పైపులు పాతవని, మురుగునీటి పైపులు, కాలువల పక్కనుండి మంచినీటి పైపులు పోతున్నాయని, లీకేజీలు జరిగినప్పుడు మురుగునీరు మంచినీటితో కలుస్తోందని అధికారులు నిర్ధారించారు. నిర్ధారణైతే జరిగిందిగానీ, నివారణకు తీసుకున్న చర్యలు శూన్యం కావడమే బాధాకరం! అప్పట్లోనే దాదాపుగా అన్ని పురపాలక, నగరపాలక సంస్థల నుండి తాగునీటి వ్యవస్థ మెరుగుదలకు వచ్చిన ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. అంతకు ముందు కూడా అనేక సార్లు ఈ తరహా ప్రతిపాదనలు పంపినట్లు కింది స్థాయి సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వాలకు ప్రజల నుండి పన్నులు వసూలు చేయడంపై ఉన్న శ్రద్ధ మౌలిక వసతుల కల్పనపై లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం. ప్రపంచబ్యాంకు వంటి విత్త సంస్థలు సైతం వీటిపై దృష్టి పెట్టకుండా, కార్పొరేట్లకు మేలు జరిగేలా చూస్తున్నాయి.

మరోవైపు ఏజెన్సీ ప్రాంతంలో వాంతులు, విరేచనాలు, జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్న వారి సంఖ్య పెరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మన్యం జిల్లాలో ఈ తరహా లక్షణాలతో వస్తున్న రోగులకు బెడ్‌లు చాలక, నేల మీదనే ఉంచి వైద్యం అందిస్తుండటం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. ఏజెన్సీ ప్రాంతంలో ఈ తరహా వ్యాధులు ప్రబలడానికి అనేక అంశాలతో పాటు నీటి కాలుష్యం కూడా కారణం. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే, రాబోయే రోజుల్లో ఎలా ఉంటుందన్న ఆందోళన స్థానిక గిరిజనుల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో ప్రస్తుతం రాజకీయ నాయకత్వం లేదు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చి, కొత్త ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పడటానికి మరి కొంత సమయం పట్టవచ్చు. అప్పటి వరకు అధికార యంత్రాంగానిదే కీలక బాధ్యత! ఈ విషయాన్ని అత్యున్నత స్థాయి నుండి దిగువ స్థాయి వరకు ఉన్న ప్రభుత్వ అధికారులు గుర్తించాలి. ముంచుకొచ్చే సమస్యలపై ఎప్పటికప్పుడే కదలి ప్రజలకు భరోసా ఇవ్వాలి. అదే సమయంలో పట్టణ ప్రాంతాలతో పాటు, మారు మూల గ్రామాల్లోనూ, ఏజెన్సీ ప్రాంతాల్లోనూ కొన్ని సీజనల్ సమస్యలు, వ్యాధులు తలెత్తుతున్నాయి. వాటిపై శ్రద్ధ పెట్టాల్సిన బాధ్యత అధికార యంత్రంగానిదే. ఏది ఏమైనా ప్రజలందరికీ రక్షిత నీటిని అందించడం ప్రభుత్వాల బాధ్యత. దాన్ని నెరవేర్చాలి.

మహనీయుల మాట



వెలిగే దీపమే ఇతర దీపాలను
వెలిగించినట్టు,
నిరంతరం నేర్చుకొనేవారే
ఇతరులకు జ్ఞానాన్ని పంచగలరు.
- రవీంద్రనాథ్ టాగూర్,
విశ్వకవి.

Rabindranath Tagore

వ్యాసం

పతాక వందన గీతం - దేశభక్తి భావం

బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా 1857 మే 10న మీరట్ నుండి మొదలైన తిరుగుబాటును బ్రిటీష్ పాలకులు, చరిత్రకారులు, పండితులు, రచయితలు, జానపద కళాకారులు రకరకాల పేర్లతో వ్యవహరించారు. ఈ తిరుగుబాటును ఎవరు ఏ పేర్లతో సంబోధించే వారనే దానిని బట్టి ఆయా సమూహాలు ఈ తిరుగుబాటును ఎలా అర్థం చేసుకున్నాయనేది మనకు అవగతమవుతుంది. బ్రిటీషర్లు ఈ తిరుగుబాటును ద్రోహం అనే భావం స్ఫురించేలా 'గదర్' గా పేర్కొన్నారు. భారతీయులు తిరుగుబాటును 'భారత స్వాతంత్ర్య ప్రథమ పోరాటం'గా గౌరవంగా పేర్కొనేవారు. బ్రిటిష్ పాలకులు ఒకప్పుడు 'గదర్' అనే పదాల్ని నేరపూరితంగా వాడుకలోకి తెచ్చినా క్రమేణా భారతీయులు ఆ పదానికి గొప్ప గౌరవాన్ని అందించారు. 1913లో భారతీయ విప్లవకారులు అమెరికాలో 'గదర్' పేరిట ఒక పార్టీని స్థాపించారు. పత్రిక పేరు కూడా 'గదర్' అనే పెట్టుకున్నారు. 1857 తిరుగుబాటు గురించి దాదాపు 75 ఏళ్ల తర్వాత వెలువడిన తొలి హిందీ నవల పేరు కూడా 'గదర్'యే. నాటి తిరుగుబాటులో పాల్గొన్న అమరులకు సంబంధించిన జ్ఞాపకాలను 'గదర్ కే ఫూల్' పేరిట అమృతలాల్ నాగర్ పుస్తకీకరించారు.

ఈ తిరుగుబాటుకు రకరకాల పేర్లు మాత్రమే ఉండడం కాదు. ఈ తిరుగుబాటు స్వభావం గురించి కూడా రకరకాల అంచనాలు ఉన్నాయి. ఇది ఫ్యూడల్ ప్రభువుల తరఫున జరిగిన తిరుగుబాటు అని కొందరు వ్యాఖ్యానిస్తే, కాదు ఇది సామాన్యుల తిరుగుబాటు అని మరికొందరు అభిప్రాయపడ్డారు. అలాగే ఈ తిరుగుబాటులో ఎంతమంది చనిపోయారు అనే సంఖ్యపై కూడా వేర్వేరు అంచనాలు ఉన్నాయి. బ్రిటిష్ వారి రికార్డుల ప్రకారం ఈ తిరుగుబాటు అణచివేసే క్రమంలో బ్రిటిష్ సైన్యం మహిళలు, పిల్లలు సహా మొత్తం 6,000 మందిని చంపినట్లు లెక్కవేశారు. కానీ తిరుగుబాటును అణచివేసే క్రమంలో బ్రిటిష్ పాలకులు చేపట్టిన ప్రతీకార చర్యల మూలంగా సుమారు 8 లక్షల నుండి 30 లక్షల మంది భారతీయులను పొట్టన పెట్టుకున్నారనేది మరో అంచనా. 1857 తిరుగుబాటు తదనంతరం చోటు చేసుకున్న కరువు, అంటువ్యాధుల మూలంగా చనిపోయిన వారి సంఖ్య కూడా ఇందులో ఇమిడి ఉంది.



ప్రేమ్ సింగ్

1857 తిరుగుబాటును నాగరికం, అనాగరికం, క్రూరం, విప్లవకరం అనే పద్ధతులలో చరిత్రకారులు, రచయితలు రెండు రకాలుగా రాసుకొచ్చారు. వాస్తవిక కథనాలు, జ్ఞాపకాలతోపాటు కల్పితాలు కూడా అనేకం ప్రచారంలోకి వచ్చాయి. వీటన్నిటికీ మించి ఈ తిరుగుబాటుకు ప్రేరణ, కారణం మతపరమైన అస్థిత్వమా? దేశభక్తి భావనా? అనే వివాదం ప్రధానంగా నిలిచింది. ఈ ప్రశ్నే సమస్యాత్మకమైనది. వివాదాస్పదమైనది కూడా. దానాదీనా మనం అర్థం చేసుకోవాల్సిన ముఖ్య విషయం ఏంటంటే 1857 తిరుగుబాటు మీద అసంఖ్యాకమైన వాద - ప్రతివాదనలు ఉన్నాయి.

భారతదేశం మాది
మేమే ఈ దేశానికి యజమానులం
ఇది మా స్వంతం. భారతదేశం మాది
స్వర్గం కన్నా సుందరమైన, పవిత్రమైన ఈ భూమి మాది

ఇది మా స్వంతం
యావత్ ప్రపంచానికి ఆధ్యాత్మిక వెలుగులు పంచే
ఈ దేశం మాది

అద్భుతమైన, వినూత్నమైన
మిగిలిన ప్రపంచానికన్నా భిన్నమైన దేశం మాది
గంగా-యమునా నదులు
సారవంతం చేసిన ఈ నేల మాది

తలకట్టున మంచు శిఖరం మాకు కావలి కాస్తుంది
పాదాల దగ్గర సముద్రం ఘోషిస్తుంది

బంగారం, వజ్రాలు, పాదరసాల గని ఈ నేల
కానీ ప్రపంచం మా గొప్పతనంతో ఊరేగుతుంది

సుదూర తీరం నుండి వచ్చిన ఫిరంగీల
(ఆంగ్లేయుల) కన్ను మా నేల మీద పడింది.
రెండు చేతులా మా దేశాన్ని దోచుకుంటుంది

సకల జనులారా అమరులు
మీకు సవాలు విసురుతున్నారు
ఈ దాస్యపు సంకెళ్లు తెంచుకోండి
నిప్పుల వాన కురిపించండి

హిందూ, ముస్లిం, సిక్కులు అందరూ
మన సోదరులే
ఈ జెండా మన స్వేచ్ఛా పతాకం
చేస్తున్నాం ఇదే వందనం.

1857 తిరుగుబాటు 167వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కీలకమైన ప్రశ్నకు సమాధానం వెతకడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం. బ్రిటిష్ పాలకుల దుర్భర అణచివేత పాలనను సహించలేక భారతీయులు చేసిన తొలి తిరుగుబాటు ఇది. విప్లవకారులు 'పతాక వందనగీతం' పాడుతూ తిరుగుబాటుకు పాల్పడ్డారు. వాస్తవానికి దేశభక్తి, జాతీయత అవే అంశాలు మనం అనుకుంటున్నంత సరళమైన, సూటైన భావాలు కావు. ఆ యుగపు లక్షణాలు, సమకాలీన పరిస్థితులు, సామాజిక నిర్మాణాలు వంటి ఎన్నో అంశాలు జాతీయతా భావాన్ని సంక్లిష్టం చేస్తాయి. ఒక్కోసారి భిన్నమైన భావానికి దారితీస్తాయి. 1857 తిరుగుబాటుకు మూలమైన దేశభక్తి, జాతీయతలను మనం ఈ దృష్టితో పరిశీలించాలి.

1857 తిరుగుబాటులో కీలక పాత్ర పోషించిన అజీముల్లా ఖాన్ యూసఫ్ జాయ్ 'పతాక వందన గీతం' రచించాడు. 'పాయమ్-ఎ-ఆజాదీ' పేరిట ఢిల్లీ నుండి వెలువడే దినపత్రికలో ఈ గీతం ప్రచురితమయ్యింది. 1857 ఫిబ్రవరి నుండి వెలువడుతున్న ఈ హిందీ-ఉర్దూ దినపత్రిక ప్రచురణకర్త అజీముల్లాఖాన్. ఈ పత్రిక ప్రధాన సంపాదకుడు బహుదూర్ షా జాఫర్ ముని మనవడు మీర్జా బేదర్ భక్త్ (ఈ పత్రికకు నానా సాహెబ్ ఆర్థికంగా తోడ్పడ్డాడు. నానా సాహెబ్ వద్ద అజీముల్లాఖాన్ దివాన్‌గా పనిచేశాడు. ఫ్రాన్స్ నుండి ముద్రణా యంత్రాన్ని కూడా తెప్పించింది అజీముల్లా ఖానే.). 1857 సెప్టెంబరు కూడా ఈ దినపత్రిక ప్రచురణ ప్రారంభమయ్యింది.

విఖ్యాతిగాంచిన బాద్షా జాఫర్ కరపత్రం కూడా 'పాయమ్-ఎ-ఆజాదీ' పత్రికలోనే ప్రచురితమయ్యింది. ఉత్తర భారతదేశంలో ఈ దినపత్రిక సర్క్యులేషన్ అనూహ్యంగా విస్తరించింది. 1857 మే 29న ఈ దినపత్రిక తిరుగుబాటుకు మద్దతు ప్రకటించింది. దాంతో బ్రిటీష్ ప్రభుత్వం రాజద్రోహ నేరం పేరిట ఈ దినపత్రిక ప్రచురణను నిషేధించింది. పత్రికా సంపాదకుడు బేదర్ భక్త్‌ను ఉరితీశారు. కాన్పూర్‌లో తిరుగుబాటు పరాజయాన్ని చవిచూడడంతో అజీముల్లా ఖాన్, నానాసాహెబ్‌తో కలిసి నేపాల్ సరిహద్దులకు తరలిపోయాడు. అక్కడే 28 ఏళ్ల యువ ప్రాయంలో అనారోగ్యంతో మరణించాడు.

అజీముల్లా ఖాన్ కాన్పూర్ వాస్తవ్యుడు. తాను భూస్వామీ కాదు. సైనికుడూ కాదు. అతి సాధారణ కుటుంబానికి చెందినవాడు. తండ్రి మెకానిక్. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. 1837-38 సంవత్సరాలలో సంభవించిన తీవ్రమైన కరువు నుండి అతనూ, అతని తల్లి బతికి బట్టకట్టారు. తదనంతరం తల్లిని కూడా కోల్పోయాడు. అనాథ శరణాలయంలో ఉంటూ, ఒక ఇంగ్లీష్ ఆసామి ఇంట్లో పనిచేస్తూ చదువుకున్నాడు. చదువు పూర్తి చేసి చాలామంది బ్రిటిషర్ల దగ్గర వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశాడు. ఆ అనుభవంతో నానాసాహెబ్ దగ్గర 'దివాన్'గా కుదురుకున్నాడు. అజీముల్లా ఖాన్ బహుభాషావేత్త (ఇంగ్లీష్, ఫ్రెంచ్, ఉర్దూ, పర్షియన్, సంస్కృతం) కావడంతో నానాసాహెబ్ అతనిని ప్రధానమంత్రిగా నియమించాడు. అజీముల్లాఖాన్ గొప్ప స్ఫురద్రూపి.



నానాసాహెబ్ పెన్షన్ పునరుద్ధరణ కోసం ఇంగ్లాడ్ వెళ్లివచ్చాడు. వెళ్లిన కార్యం సఫలం కాలేదు. కానీ తిరిగి వచ్చేనాటికి భారతదేశాన్ని బ్రిటీష్ దాస్య బంధనాల నుండి విముక్తి గావించాలనే ఆశయాలను నింపుకున్నాడు. బ్రిటీష్ సామ్రాజ్యం అజేయ బల సంపన్నురాలు అనేది ఒక మిథ్య అని కళ్లారా తెలుసుకుని వచ్చాడు. క్రిమియా యుద్ధంలో రష్యా సేనలు బ్రిటన్ - ఫ్రాన్స్ ఉమ్మడి సైన్యాన్ని చిత్తుచిత్తుగా ఓడించాయి. ఆ నాటికి దేశంలో 'నవజాగరణ' పేరిట పునర్వికాస ఉద్యమం కొనసాగుతున్నది. దీనితో నిమిత్తం లేకుండానే అజీముల్లాఖాన్ భారతదేశ స్వాతంత్ర్యం కోసం కృషి మొదలుపెట్టాడు.

ప్రతి పదంలో ఈ పాట మనకు ఏం తెలియజేస్తుంది? బ్రిటిష్ దురాక్రమణ మన జాతి మొత్తాన్ని దాస్యంలోకి నెట్టిందనే కదా. భారతీయులే ఈ దేశానికి అసలైన వారసులు అనే కదా. 1857 తిరుగుబాటు తూర్పు, ఉత్తర, మధ్య భారత ప్రాంతాలకే పరిమితం అయినా విప్లవకారులు దేశం అంటే హిమాలయ పర్వత శ్రేణుల నుండి దిగువన ఉన్న మహాసముద్రం వరకూ అని కదా నినదించింది. సారవంతమైన, సంపద్వంతమైన ఈ దేశాన్ని బ్రిటిష్‌వాడు ఎలా దోచుకుంటున్నాడని కదా చెప్పిందీ. 'ఆసియా అద్భుత ద్వీపకల్పం' అన్న ఆంగ్లేయుల మాయామేయ నాగస్వరానికి తలలు ఊపే భారతీయులూ ఉన్నారు. దీని ప్రతిఫలాన్ని మనం గాంధీ రచించిన 'హింద్ స్వరాజ్'లో చూస్తాం. 'బ్రిటిష్ వాళ్లు మనల్ని దాస్యులుగా చెయ్యలేదు. మనమే ఐచ్ఛికంగా ఈ దాస్యాన్ని అంగీకరించాం' అంటాడు గాంధీ.

రాజ సంస్థానాలు, బ్రిటిష్ ఇండియా సైన్యం 1857 తిరుగుబాటుకు వెన్నుదన్నుగా నిలబడాల్సింది పోయి బ్రిటిష్‌వాళ్ల కొమ్ము కాశాయనేది నిష్ఠుర సత్యం. కనీసం తటస్థత కూడా పాటించలేదు. పునరుజ్జీవన ఉద్యమం పేరిట సాంస్కృతిక చైతన్యం ఉజ్జీవింపచేస్తున్నాం అని ప్రకటించుకున్న 'భద్రలోక్' విద్యాధికులు కూడా ఈ తిరుగుబాటుతో చేతులు కలపలేదు. అమరుల స్ఫూర్తితో ఈ దేశ దాస్య శృంఖలాలను బద్దలు కొట్టడానికి కృషి చెయ్యడం ద్వారా భారతీయతను చాటి చెప్పుకోవాలని పతాక వందనగీతం పిలుపునిచ్చింది. 1857 తిరుగుబాటు మన దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన ప్రథమ పోరాటం. ఈ పోరాటమే మన దేశ స్వాతంత్ర్యానికి బాటలు వేసింది. అలాంటి తొలి స్వాతంత్ర్య సంగ్రామ పోరాటానికి చేయూతనివ్వకుండా రాజులు, రాజసంస్థానాలు, మతతత్వ సంస్థలు, సామాజిక ప్రముఖులు అనేకులు ద్రోహానికి పాల్పడ్డారు. ఇలాంటి ద్రోహుల మూలంగానే దేశం విభజన పాలయింది.

తిరుగుబాట్ల సందర్భంగా మతపరమైన, కులపరమైన, జాతిపరమైన ప్రాంతీయపరమైన అనేక పొరపాటు ధోరణులు తలెత్తడం సహజం. ఉపఖండాన్ని పోలిన ఈ దేశంలో పాత సమాజపు లక్షణాలతోపాటు గొప్ప వైవిధ్యతను, అసమానతలను ప్రోది చేసుకుని ఉంది. కాబట్టి తిరుగుబాట్ల సందర్భంలో కూడా ఈ వెనుకబాటుతనపు అవలక్షణాలు పొడచూపడంలో ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. పతాక వందనగీతం మత అస్థిత్వ ప్రాతిపదికన రూపొందించబడిన గీతం కానే కాదు. వివిధ మతాల మధ్యన సోదరభావం ఉండాలని తెలియచెప్పింది. అజీముల్లాఖాన్ ఈ గీతాన్ని రాసే సందర్భంలో మత అస్థిత్వాలని జాతీయ అస్థిత్వంలో మిళితం చేసేందుకు పిలుపునిచ్చాడు. మహిళల గురించి కూడా ప్రస్తావించి ఉంటే ఈ గీతానికి మరింత పరిపూర్ణత సిద్ధించి ఉండేది. తిరుగుబాటు సందర్భంగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలు అసామాన్యమైన పాత్ర పోషించారు.

ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న నయా సామ్రాజ్యవాద విధానాలు, మత విద్వేషాల నేపథ్యంలో ఈ పతాక వందనగీతం ఇప్పటికీ తన తాజాదనాన్ని, ప్రాముఖ్యతను కోల్పోలేదని నేను భావిస్తున్నా. భారత్, పాక్, బంగ్లాదేశ్‌ల యువతరం ఈ గీతాన్ని స్వంతం చేసుకోవాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది.

(రచయిత సోషలిస్టు ఉద్యమకారుడు. ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్- సిమ్లా ఫెలోషిప్ పొందినవారు.)

విశ్లేషణ

నేతల విధాత 'ఆమె'



ఓటింగ్‌లో పెరుగుతున్న మహిళా స్వతంత్రతను గుర్తించిన పాలక పార్టీలు తమ ఆర్థిక విధానాలకు భిన్నమైన సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయి. మహిళల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలను ప్రకటించడం ఇటీవల పెరిగింది. మోడీ ప్రభుత్వం మహిళల్లో వున్న భక్తిని మతతత్వ రాజకీయాలకు వాడుకోవాలని చూసింది. కానీ ఈ ఎన్నికలు వచ్చేటప్పటికి తమ పాచికలు పారడం లేదని గుర్తించి మోడీ గ్యారంటీ పేరుతో మహిళా సంక్షేమ పథకాలను ప్రకటించాల్సి వచ్చింది. కర్ణాటక, తెలంగాణ ఎన్నికల ఫలితాల్లో తమకు అధికార పీఠాన్ని అందించడంలో మహిళా పథకాలే కీలకమని గుర్తించిన కాంగ్రెస్ దేశవ్యాప్త హామీలు ఇచ్చింది. మన రాష్ట్రంలో గత ఐదేళ్ళుగా వైసిపి ప్రభుత్వం మహిళలకు నేరుగా నగదు బదిలీ పథకాలు అమలు చేసింది. ఆ పథకాలను తీవ్రంగా విమర్శించిన టిడిపి, వైసిపి కంటే ఎక్కువ నగదు బదిలీ పథకాలను ప్రకటించాల్సి వచ్చింది. దీనంతటికీ కారణం మహిళా ఓట్లు.

మన రాష్ట్రంలో 2019 కంటే 2024లో పోలింగ్ పెరిగింది. ఈ సంవత్సరం సుమారు 17 లక్షల ఓట్లు అధికంగా పోలయ్యాయి. పెరిగిన ఈ 17 లక్షల ఓట్లలో 12 లక్షల ఓట్లు మహిళలవి కావడం విశేషం. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన ఆరు విడతల పోలింగ్ (అందుబాటులో వున్న) వివరాలు పరిశీలించి చూసినా మహిళా ఓట్లు పెరిగాయనే తెలుస్తోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఇదే ధోరణి వ్యక్తమయింది. 2019లో పురుషుల కంటే మహిళల ఓట్లు 0.16 శాతం ఎక్కువ పోలయ్యాయి. ఒకనాడు మహిళలను ప్రత్యేకంగా ఓటు కూడా అడగని పరిస్థితి. నేడు ఆమె ఓటే పాలకుల తలరాతలు మారుస్తున్నది. పాలక పార్టీలన్నీ మహిళలకు ప్రత్యేక పథకాలు ప్రకటించాల్సిన స్థితికి మహిళా ఓటింగ్ శక్తి పెరిగింది. దేశంలో బిజెపి, కాంగ్రెస్ మ్యానిఫెస్టోల లోని 'మోడీకి గ్యారంటీ', 'నారీ న్యాయ' గానీ, మన రాష్ట్రంలో వైసిపి, టిడిపి పార్టీలు ప్రకటించిన సంక్షేమ పథకాలు గానీ మహిళా ఓట్లను ఆకర్షించడానికే. మన రాష్ట్ర శాసనసభ ఎన్నికలు పూర్తయి పక్షం రోజులు అయ్యింది. పార్లమెంట్ ఎన్నికలు ముగింపు దశకు వచ్చాయి. గెలుపు ఓటములపై ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నా మహిళా ఓటు ఎటువైపు అన్నదే నిర్ణయాత్మకమని అందరూ అంగీకరిస్తున్నారు. నేతల రాతలను నిర్ణయించే స్థాయికి 'ఆమె' చేరుకునేందుకు అనేక ఆటంకాలను అధిగమిస్తూ, అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఎదిగింది.



వి. రాంభూపాల్

అనేక వేల సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా వున్న పురుషాధిక్య భావజాలమే భారతదేశంలో కూడా కొనసాగింది. మన దేశంలో లింగ వివక్షతో పాటు కులవివక్ష అత్యధికమందిని విద్యా, విజ్ఞానాలకు దూరం చేసింది. ఈ దురాగతాలను మతం సమర్థించింది. ఏది సరైందో, ఏది కాదో ఆలోచించే స్థితి స్త్రీలకు, అట్టడుగు కులాల వారికి వుండదని, వారు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోలేరనే భావం తరతరాలుగా, మన నరనరాన జీర్ణించుకుపోయింది. స్వాతంత్ర్యం తర్వాత వచ్చిన సార్వజనీన ఓటింగ్ హక్కు చట్టబద్ధ సమానతను ఇచ్చినా, సాంఘిక వివక్షత, నిరక్షరాస్యత, ఆర్థిక పరాధీనత, పెత్తందారీ వ్యవస్థ అనే పాత చట్రంలో ఈ చట్టబద్ధ సమానత నామమాత్రంగా మారింది. అందుకే ఎన్నికల్లో ఓటింగ్ అంటే కుటుంబ యజమాని నిర్ణయమే కుటుంబ సభ్యుల నిర్ణయంగా, గ్రామ పెత్తందారీ మాటే ఊరుమ్మడి మాటగా చాలాకాలం శాసించాయి. ప్రజల దరి చేరాల్సిన ప్రజాస్వామ్యం అత్యధిక మందికి దూరంగానే నిలిచిపోయింది.

చదువు- పొదుపు- రాజకీయ చైతన్యం

సంఘ సంస్కరణ ఉద్యమాలు, కమ్యూనిస్టు భావజాలం సమాజాన్ని ఎంతో జాగృతి చేశాయి. మహిళా చదువు ప్రాధాన్యతను ప్రభుత్వాలు గుర్తించేటట్లు ఉద్యమాలు నడిచాయి. అమ్మాయిలకు ప్రత్యేక పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలను ప్రభుత్వాలు ఏర్పాటు చేయడంతోపాటు, అక్షరాస్యత ఉద్యమాలు స్త్రీలకు వయోజన విద్యను అందించాయి. 1951లో స్త్రీల అక్షరాస్యత 8.3 శాతం మాత్రమే వుండగా, 1961 నాటికి 15.3 శాతం, 1971 నాటికి 22 శాతం, 1981 నాటికి 28.5 శాతం, 2001 నాటికి 52.1 శాతం, 2011 నాటికి 65.5 శాతం, 2021 నాటికి 69 శాతానికి చేరింది. 1980 తర్వాత స్త్రీ అక్షరాస్యతలో గణనీయమైన అభివృద్ధి జరిగింది. జాతీయ కుటుంబ ఆరోగ్య తాజా సర్వే ప్రకారం దేశంలో మహిళలు 54 శాతం మంది సెల్‌ఫోన్లు, 33 శాతం మంది ఇంటర్‌నెట్ వినియోగిస్తున్నారు. అర్బన్‌లో 52 శాతం మంది, రూరల్‌లో 25 శాతం మంది మహిళలు ఇంటర్‌నెట్ వాడుతున్నట్లు 2022-23 ప్రపంచబ్యాంకు నివేదిక ప్రకటించింది. విద్య, విజ్ఞానం ఆమె వికాసాన్ని విశ్వవ్యాపితం చేశాయి.

స్వయం సహాయక గ్రూపుల ఏర్పాటు 1970లో ప్రారంభమై మహిళల జీవితాల్లో పెనుమార్పులు తీసుకు వచ్చింది. స్వయం ఉపాధి మహిళా అసోసియేషన్ (సేవా) పేరుతో ప్రారంభమైన మహిళా గ్రూపులు 1992లో 'నాబార్డు'తో స్వయం సహాయక గ్రూపుల లింకేజి కార్యక్రమం అమలులోకి రావడంతో ఆర్థిక నిర్వహణలో మహిళలు కీలక పాత్ర పోషించేటట్లు చేసింది. ఈ గ్రూపుల పనిపద్ధతులు వారి అవగాహనను, సమిష్టితత్వాన్ని పెంచాయి. గ్రూపు సభ్యులందరితో కలిసి వుండడం, నిర్ణయించుకున్న సమయానికి సమావేశం కావడం, అకౌంట్స్ నిర్వహణ, బ్యాంకులతో, వివిధ శాఖల అధికారులతో వ్యవహరించడం లాంటి అనేక కొత్త పద్ధతులు ఈ గ్రూపులు నేర్పాయి. మన రాష్ట్రంలో 2019లో 8.71 లక్షల స్వయం సహాయక గ్రూపులు వుండగా నేటికి సుమారు 10 లక్షల 98 వేల గ్రూపులకు విస్తరించాయి. ఈ గ్రూపుల్లో ఒక కోటి డెబ్బై లక్షల మంది పైగా మహిళలు సభ్యులుగా వున్నారు. ఈ సంవత్సరం జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన లెక్కల ప్రకారం 83 శాతం గ్రూపులు సగటున రూ. 5 లక్షలకు పైగా బ్యాంకు రుణాలు తీసుకున్నాయి. వీటి విలువ ఒక లక్ష 55 వేల కోట్లు. తీసుకున్న రుణాలను 99.7 శాతం గ్రూపులు బ్యాంకులకు సకాలంలో చెల్లిస్తున్నాయి. ఇంత పెద్ద ఎత్తున ఆర్థిక నిర్వహణలో మహిళలు భాగస్వామ్యం కావడమనేది కుటుంబ జీవనంలో చాలా మార్పులు తెచ్చింది. గతంలాగా మగవారు తెచ్చిపెడితే వండిపెట్టడం మాత్రమే మహిళ పని అనుకునే ధోరణి మారింది. గ్రూపులో పొదుపుకు, రుణాల చెల్లింపుకు నగదు అవసరాలు పెరిగాయి. వాటి కోసం ఆమె నిత్యం పనులు వెతుక్కుంటున్నది. శ్రమలో పాల్గొనే స్త్రీ, పురుష నిష్పత్తిలో పెద్ద మార్పు వచ్చింది. ఉదాహరణకు-2018లో శ్రామిక శక్తిలో పురుషుల వాటా 76 శాతం వుంటే 2023 నాటికి 79 శాతానికి అంటే 3 శాతం మాత్రమే పెరిగింది. ఇదే సంవత్సరాల్లో మహిళల శ్రామిక వాటా 23 శాతం నుండి 37 శాతానికి అంటే 14 శాతం పెరిగింది. డబ్బును వినియోగించడంలో ఆమెది కీలక పాత్ర అయ్యింది. అప్పు తేవడం, చెల్లించడం ఆమె పనిలో ప్రధాన భాగమైంది.

ఆర్థిక నిర్వహణలో ఆమె పాత్ర పెరిగేకొద్దీ రాజకీయ చైతన్యం పెరిగింది. 1992లో జరిగిన 73, 74 రాజ్యాంగ సవరణ స్థానిక సంస్థల్లో 1/3 వంతు స్థానాలను మహిళలకు రిజర్వు చేసింది. పంచాయితీ మొదలు నగరాల వరకు చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరిగింది. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రిజర్వేషన్ సదుపాయాన్ని మరింతగా పెంచాయి. అసెంబ్లీ, పార్లమెంట్‌లో 33 శాతం రిజర్వేషన్ కావాలనే ఉద్యమాలు జరిగాయి. పాలక పార్టీలు అనేక డొంక తిరుగుడు వాదనలు చేసి బిల్లును వాయిదా వేయగలిగాయే గానీ ఆ డిమాండ్‌ను మహిళల మది నుండి దూరం చేయలేకపోయాయి. మోడీ ప్రభుత్వం హడావుడిగా 2023 సెప్టెంబర్ నెలలో 106వ రాజ్యాంగ సవరణతో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును చట్టబద్ధం చేసింది. అయితే అమలు మాత్రం వాయిదా వేశారు.

ప్రభుత్వాల గురించి, రాజకీయ పార్టీల గురించి మహిళలు ఆలోచించే పద్ధతి మారింది. తమ జీవితానుభవం నుండి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్థితి పెరిగింది. అందుకే మహిళా ఓటింగ్ పెరుగుతూ వస్తున్నది. 2019 ఎన్నికల తర్వాత జాతీయ ఎన్నికల కమిషన్ స్టడీస్-సిఎస్‌డిఎస్ అధ్యయనం కింది లెక్కలు ప్రకటించింది (పట్టిక).

ప్రపంచీకరణ- మహిళలు- సంక్షేమ పథకాలు

ప్రపంచీకరణ విధానాల వల్ల ప్రభుత్వాల నుండి పేద, దిగువ మధ్యతరగతి ప్రజలకు అందుతున్న అనేక సేవలు కుదించుకుపోయాయి. అనేకమంది కనీస జీవితావసరాలు తీరక కునారిల్లుతున్నారు. విద్య, వైద్యం, పౌరసేవలను ప్రైవేటీకరించడం ఈ విధానాల లక్ష్యం. కుటుంబ నిర్వహణతో పాటు, ఆర్థిక కార్యకలాపాల్లో కీలకమైన మహిళ వీటి గురించి ఆలోచించడం, మాట్లాడడం, పాలకులను ప్రశ్నించడం పెరిగింది. ఉల్లి ధర కూడా ఎన్నికల ఫలితాలను తారుమారు చేసే పరిస్థితి వచ్చింది. ఓటింగ్‌లో పెరుగుతున్న మహిళా స్వతంత్రతను గుర్తించిన పాలక పార్టీలు తమ ఆర్థిక విధానాలకు భిన్నమైన సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయి. మహిళల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలను ప్రకటించడం ఇటీవల పెరిగింది. మోడీ ప్రభుత్వం మహిళల్లో వున్న భక్తిని మతతత్వ రాజకీయాలకు వాడుకోవాలని చూసింది. కానీ ఈ ఎన్నికలు వచ్చేటప్పటికి తమ పాచికలు పారడం లేదని గుర్తించి మోడీ గ్యారంటీ పేరుతో మహిళా సంక్షేమ పథకాలను ప్రకటించాల్సి వచ్చింది. కర్ణాటక, తెలంగాణ ఎన్నికల ఫలితాల్లో తమకు అధికార పీఠాన్ని అందించడంలో మహిళా పథకాలే కీలకమని గుర్తించిన కాంగ్రెస్ దేశవ్యాప్త హామీలు ఇచ్చింది. మన రాష్ట్రంలో గత ఐదేళ్ళుగా వైసిపి ప్రభుత్వం మహిళలకు నేరుగా నగదు బదిలీ పథకాలు అమలు చేసింది. ఆ పథకాలను తీవ్రంగా విమర్శించిన టిడిపి, వైసిపి కంటే ఎక్కువ నగదు బదిలీ పథకాలను ప్రకటించాల్సి వచ్చింది. దీనంతటికీ కారణం మహిళా ఓట్లు.

మహిళా చైతన్యం సమాజ సహజ పురోభివృద్ధిలో భాగం. జనాభాలో సగ భాగంగా వున్న మహిళా చైతన్యాన్ని కేవలం ఎన్నికల్లో గట్టెక్కే చిట్కాలతో సంతృప్తి పరచడం సాధ్యం కాదు. సమాజ మౌలిక మార్పు కోసం చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగడంతో పాటు, సంఘటిత ఉద్యమాలే మహిళా హక్కుల రక్షణకు, సమాజ ఉన్నతికి పునాదులు వేస్తాయి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

ఓటు హక్కు - మహిళలు (శాతంలో)

సంవత్సరం	స్వంత నిర్ణయం	ఇతరుల ప్రభావం	ఏ అభిప్రాయం లేకుండా
2009	43	41	10
2014	51	40	09
2019	81	16	03

2024 లోక్‌సభ ఎన్నికలు

20 శాతం మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు

- 14 శాతంపై అత్యాచార, హత్య కేసులు
- మొత్తం 8,337 మంది పోటీ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీలో ఉన్న 8,337 మంది అభ్యర్థుల్లో 20 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. వీరిలో 14 శాతం మందిపై అత్యాచారం, హత్య, హత్యాయత్నం, మహిళలపై నేరాలకు సంబంధించిన తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి. మొత్తం 8,360 మంది ఎంపి అభ్యర్థులుండగా వీరిలో 8,337 మంది అఫిడవిట్ లను అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) విశ్లేషించింది. వీరిలో జాతీయ పార్టీల నుంచి 1,333 మంది, ప్రాంతీయ పార్టీల నుంచి 532 మంది, గుర్తింపు లేని పార్టీల నుంచి 2,580 మంది, స్వతంత్రంగా 3,915 మంది అభ్యర్థులు ఉన్నారు.

క్రిమినల్ కేసులున్న అభ్యర్థులు

గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల క్రిమినల్ నేపథ్యం గురించి ఈ విశ్లేషణ వెల్లడించింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న 8,337 మంది అభ్యర్థుల్లో 1,643 మంది (20 శాతం) తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన 7928 మంది అభ్యర్థుల్లో 1500 మంది (19 శాతం) అభ్యర్థులు తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో విశ్లేషించిన 8,205 మంది అభ్యర్థుల్లో 1,404 మంది (17 శాతం) అభ్యర్థులు తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. 2009 లోక్‌సభ ఎన్నికల సమయంలో విశ్లేషించిన 7,810 మంది అభ్యర్థుల్లో 1,158 మంది (15 శాతం) తమపై క్రిమినల్ కేసులు తమ అఫిడవిట్లలో ప్రకటించారని ఎడిఆర్ తెలిపింది.

తీవ్రమైన క్రిమినల్ కేసులున్న అభ్యర్థులు

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న 1,191 మంది (14 శాతం) అభ్యర్థులపై అత్యాచారం, హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, మహిళలపై నేరాలు వంటి తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఎడిఆర్ గుర్తించింది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో విశ్లేషించిన 7,928 మంది అభ్యర్థుల్లో 1,070 మంది (13 శాతం) అభ్యర్థులు తమపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో 8,205 మంది అభ్యర్థుల్లో 908 మంది (11 శాతం) తమపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో 7,810 మంది అభ్యర్థుల్లో 608 మంది (8 శాతం) తమపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారని ఎడిఆర్ విశ్లేషణలో వెల్లడించింది.

పార్టీల వారీగా క్రిమినల్ నేపథ్యం

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నవారిలో బిజెపి నుంచి పోటీ చేసిన 440 మంది అభ్యర్థుల్లో 191 మంది (43 శాతం), కాంగ్రెస్ నుంచి 327 మంది అభ్యర్థుల్లో 143 మంది (44 శాతం), బిఎస్‌పి నుంచి బరిలోకి దిగిన 487 మంది అభ్యర్థుల్లో 63 మంది (13 శాతం), 3,915 స్వతంత్ర అభ్యర్థుల్లో 550 మంది (14 శాతం) తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులను 197 మంది అభ్యర్థులు ప్రకటించారు. వీరిలో 16 మంది అభ్యర్థులు అత్యాచారానికి సంబంధించిన అభియోగాలను (ఐపిసి సెక్షన్ - 376) ఎదుర్కొంటున్నారు.

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో 751 రాజకీయ పార్టీలు పోటీ చేస్తున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 677 రాజకీయ పార్టీలు, 2014లో 464 రాజకీయ పార్టీలు, 2009 లోక్‌సభ ఎన్నికల్లో 368 రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. అంటే 2009 నుంచి 2024 మధ్య రాజకీయ పార్టీల సంఖ్య 104 శాతం పెరిగిందని ఎడిఆర్ తెలిపింది.

బీహార్‌లో విద్యార్థులకు వడదెబ్బ

- సొమ్మసిల్లిపడిపోయిన 100 మందికిపై విద్యార్థులు
- జూన్ 8 వరకూ సెలవులు ప్రకటించిన ప్రభుత్వం

పాట్నా : బీహార్‌లో బుధవారం సుమారు 100 మంది వివిధ పాఠశాలల విద్యార్థులు వడదెబ్బకు గురయ్యారు. పాఠశాలల ఆవరణలోనే సొమ్మసిల్లి పడిపోయారు. షేక్‌పురా జిల్లాలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో ఎండదెబ్బకు 50 మందికి పైగా విద్యార్థులు సొమ్మసిల్లి పడిపోయినట్లు సమాచారం. దీంతో చిన్నారులకు చికిత్స కోసం షేక్‌పురాలోని సదర్ హాస్పిటల్‌కి తరలించారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సదర్ ఆసుపత్రి వైద్యులు రజనీకాంత్ కుమార్ తెలిపారు. షేక్‌పురా జిల్లాలోనే కాదు.. పలు జిల్లాల్లోని పాఠశాలల్లోని విద్యార్థులు ఎండవేడిమికి తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయారు. మన్‌కుల్ జిల్లాలోని మిడిల్ స్కూల్‌లో బుధవారం ఉదయం ఆరేడుగురు విద్యార్థులు కళ్లుతిరిగి పడిపోయారు. ఈ ఘటనపై ఆ స్కూల్ హెడ్ మాస్టర్ సురేస్ ప్రసాద్ మాట్లాడుతూ.. 'ఈరోజు ఉదయం స్కూల్లో ప్రార్థనలు జరుగుతున్న సమయంలో విద్యార్థులు స్పృహతప్పి పడిపోయారు. వీరికి ప్రథమ చికిత్స అందించేందుకు ప్రయత్నించాము. ఎండలకు చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు' అని ఆయన అన్నారు. మరో జిల్లా అయిన బెగుసరాయ్‌లోని మతిహాని మిడిల్ స్కూల్‌లో ఆరుగురు విద్యార్థులు స్పృహతప్పి పడిపోయారు. వీరిని ప్రాథమిక చికిత్సా కేంద్రానికి తరలించారు. బీహార్‌లో ఈ నెల 15 వరకూ మాత్రమే వేసవి సెలువులు ఇచ్చారు. తరువాత నుంచి స్కూల్ పున:ప్రారంభమాయ్యాయి. బుధవారం బీహార్‌లో అనేక ప్రాంతాల్లో 45 డిగ్రీల సెల్సియన్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు సమాచారం. దీంతో అనేక మంది విద్యార్థులు కళ్ళు తిరిగిపడిపోవడం, వడదెబ్బకు గురికావడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనల నేపథ్యంలో బీహార్‌లోని నితీష్‌కుమార్ ప్రభుత్వంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఈ నెల 30 నుంచి జూన్ 8 వరకూ అన్ని విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది.

ఈ ఘటనపై బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆర్‌జెడి నేత తేజస్వియాదవ్ నితీష్‌కుమార్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో ప్రభుత్వం లేదు. ప్రజాస్వామ్యం లేదు. బ్యూరోక్రసీ మాత్రమే ఉన్నది. రాష్ట్రంలో 47 డిగ్రీల ఉష్ణోగ్రతలున్నాయి. ఈ నేపథ్యంలో స్కూల్ టైమింగ్స్ మార్చమని ఎవరు చెప్పినా రాష్ట్ర సిఎం నితీష్‌కుమార్ వినే పరిస్థితి లేదు. ఎండలు మండుతున్నవేళ చిన్నారులకు కనీస విశ్రాంతి లేదు. బీహార్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు సరిగ్గా లేవు. ఈ విషయాల్లోనే కాదు.. అసలు ఏ విషయమూ సిఎం చేతులో లేదు.' అని తేజస్వి అన్నారు.

షార్జీల్ ఇమామ్‌కు ఉపశమనం

- రాజద్రోహం కేసులో బెయిల్
- మరో కేసులో మాత్రం జైలులోనే

న్యూఢిల్లీ : వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)కి వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా రాజద్రోహ ప్రసంగాలు చేశారనే కేసులో విద్యార్థి నాయకుడు షార్జీల్ ఇమామ్‌కు కాస్త ఊరట లభించింది. ఢిల్లీ హైకోర్టు బుధవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఢిల్లీ అల్లర్ల కేసులో మాత్రం ఆయన జైలులోనే ఉండనున్నారు. ఈ కేసులో చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం ఆరోపణలతో కూడిన పెద్ద కుట్ర కేసులో అతను జైలులోనే గడపనున్నారు. ఈ మేరకు న్యాయమూర్తులు సురేష్ కుమార్ కైత్, మనోజ్ జైన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు ఇచ్చింది. షార్జీల్ ఇమామ్ జనవరి 28, 2020 నుంచి జైలులో ఉన్నారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)లో మాజీ స్కాలర్ షార్జీల్ ఇమామ్.. 2019లో జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలో, 2020లో అలీఘర్ ముస్లిం యూనివర్సిటీలో వివాదాస్పద సీఏఏకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా చేసిన ప్రసంగాలకు సంబంధించినది ఈ కేసు. ఫిబ్రవరి 17న ఢిల్లీ కోర్టు బెయిల్ నిరాకరించటంతో షార్జీల్ ఇమామ్ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

పాలస్తీనాకు సంఘీభావంగా

అకడమిక్ సిబ్బంది విధుల బహిష్కరణ



లాస్‌ఏంజెల్స్ : పాలస్తీనాకు సంఘీభావంగా అందోళన చేస్తున్న విద్యార్థులపై అణచివేతను నిరసిస్తూ లాస్‌ఏంజెల్స్‌లోని కాలిఫోర్నియా యూని వర్శిటీలో అకడమిక్ సిబ్బంది మంగళవారం తమ విధులను బహిష్కరించారు. పాలస్తీనా అనుకూల నిరసనలు, ఆందోళనల పట్ల కాలిఫోర్నియా యూనివర్శిటీ వ్యవహరించిన తీరును వారు నిరసించారు. కాలిఫోర్నియా యూనివర్శిటీ లాస్‌ఏంజెల్స్ కేంపస్ అధికారికంగా సమ్మెలో వుందని యునైటెడ్ ఆటో వర్కర్స్ (యుఎడబ్ల్యు) లోకల్ 4811 మంగళవారం ఉదయం ఎక్స్‌లో పోస్టు పెట్టింది. కాలిఫోర్నియా వర్శిటీకి చెందిన పది కేంపస్‌లు, లారెన్స్ బర్కిలీ నేషనల్ లేబరేటరీకి చెందిన దాదాపు 48వేల మంది అకడమిక్ సిబ్బంది ఈ యూనియన్‌లో సభ్యులుగా వున్నారు. 'ఎవరి యూనివర్శిటీ? ఇది మా యూనివర్శిటీ' అంటూ నిరసనకారులు నినదించారు. డిక్సన్ ప్లాజా వద్ద వారు ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు యూనివర్శిటీ విద్యార్థి వార్తాపత్రిక డైలీ బ్రూయిన్ వార్తలను ప్రచురించింది. స్వతంత్ర పాలస్తీనాకు అనుకూలంగా వారు నినాదాలు చేశారు. కేంపస్ ప్రవేశ మార్గాన్నిదిగ్బంధించారు. గాజాలో కాల్పుల విరమణ తక్షణమే పాటించాలని వారు కోరారు. శాంతియుతంగా ఆందోళనలు నిర్వహించే హక్కు తమకు వుందని పేర్కొన్నారు. అకడమిక్ వర్కర్లు, విద్యార్థులు, కమ్యూనిటీ సభ్యులు శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్నపుడు, కేంపస్‌లో మకాం వేసినపుడు యూనివర్శిటీ యాజమాన్యం తప్పుడు మార్గం అనుసరించింది.కాలిఫోర్నియా వర్శిటీ శాంతాక్రజ్ కేంపస్‌లో అకడమిక్ వర్కర్లు గత సోమవారం తమ విధులను బహిష్కరించారు.

ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో నిషేధిత క్షిపణుల మోహరింపు

- అమెరికా కుతంత్రాన్ని బయటపెట్టిన రష్యా



మాస్కో : నిషేధిత క్షిపణులను ఆసియా పసిఫిక్ ప్రాంతంలో మోహరించాలన్న అమెరికా కుతంత్రాన్ని రష్యా బయటపెట్టింది. ఇప్పటికే ఆ క్షిపణుల మోహరింపు ప్రక్రియను అమెరికా ప్రారంభించిందని అది తెలిపింది. కొత్త ప్రదేశాల్లో తన క్షిపణులను అమర్చుకునేందుకే మధ్యంతర శ్రేణి అణు క్షిపణుల ఒప్పందం (ఐఎన్‌ఎఫ్) నుండి అమెరికా వైదొలగిందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారంపై బుధవారం జరిగిన రాయబారుల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 500 నుండి 5500కిలోమీటర్ల పరిధిలో ఉపయోగించగల అణు, సాంప్రదాయ క్షిపణుల్లో చాలా రకాలను రష్యా, అమెరికాలు కలిగి వుండకుండా 1987నాటి ఐఎన్‌ఎఫ్ ఒప్పందం నిషేధించింది. 2019లో అమెరికా దీన్నుండి బయటకు వచ్చేసింది. పైగా రష్యా ఈ ఒప్పందాన్ని అమలు చేయడం లేదంటూ నిందలు వేసింది. ఇప్పటికే ఫిలిప్పైన్స్‌లో అమెరికా ఈ తరహా క్షిపణులను మోహరించిందని రష్యా విదేశాంగ మంత్రి తెలిపారు. ఏప్రిల్‌లో అమెరికా, ఫిలిప్పైన్స్ దక్షిణ చైనా సముద్రంలో పెద్ద ఎత్తున సైనిక విన్యాసాలు నిర్వహించాయి. ఆ సమయంలో అమెరికా తన మధ్యంతర శ్రేణి క్షిపణి వ్యవస్థను ఆ ప్రాంతంలో మోహరించింది. అమెరికా చర్యను చైనా, రష్యా ఖండించాయి.

'జక్కా' స్ఫూర్తితో విజ్ఞాన వికాసం

(మొదటి పేజీ తరువాయి)

బాధితులకు ఆయన అండగా నిలిచారని గుర్తు చేశారు. నిరాడంబరంగా ఉండేవారని, చెక్క బండిపై మైక్ పెట్టుకొని ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారని తెలిపారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా జీవితాన్ని విప్లవానికి అంకితం చేశారని, ఆదర్శ కమ్యూనిస్టుగా నిలిచారని వివరించారు. రాష్ట్ర కమిటీ తరపున నివాళ్లర్పించారు. ఆయన పేరుతో మంచి హాలు నిర్మించారని అభినందించారు. ఈ సభకు జెఎస్ ట్రస్ట్ చైర్మన్ చంద్ర రాజగోపాల్ అధ్యక్షత వహించారు. మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ వెంకమరాజు, గోగుల శ్రీనివాసులు, కె.అజయ్‌కుమార్, తుళ్లూరు గోపాల్, మూలె వెంగయ్య, జక్కా వెంకయ్య కోడలు, న్యాయవాది జక్కా శేషమ్మ, ట్రస్ట్ కన్వీనర్ భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రఫాలోకి ఇజ్రాయిల్ ట్యాంకులు



గాజా : రఫాతో సహా మొత్తంగా గాజాపై దాడులను ఆపేందుకు అంతర్జాతీయ సమాజం తర్జన భర్జనలు పడుతుంటే మరోపక్క ఇజ్రాయిల్ బుధవారం ఉదయం కూడా రఫావ్యాప్తంగా దాడులు జరిపింది. రఫాలోకి ఇజ్రాయిల్ ట్యాంకులు చొచ్చుకు పోతున్నాయని ప్రత్యక్ష సాక్షులు, పాలస్తీనా భద్రతా వర్గాలు తెలిపాయి. బయటకు ఎవరైనా వస్తే ఇజ్రాయిల్ డ్రోన్‌లతో కాల్చేస్తున్నందున ప్రస్తుతం ప్రజలు ఇళ్ళలోపలే వుంటున్నారని అక్కడి నివసిస్తున్న అబ్దుల్ ఖతీబ్ తెలిపారు. బదర్ శిబిరాన్ని, రఫాకు పశ్చిమంగా గల జురోబ్ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకున్నారని పాలస్తీనా వర్గాలు తెలిపాయి. మంగళవారం 13 మంది బాలికలు, మహిళలతో సహా 21మంది పాలస్తీనియన్లు మరణించారు. రఫాలోని అల్‌మవాసి ఏరియాలోని నిర్వాసితుల శిబిరంపై ఈ దాడులు జరిగాయని పాలస్తీనా భద్రతా వర్గాలు తెలిపాయి. ఆర్మీ ఆదేశాల మేరకే నిర్వాసితులు అక్కడకు వచ్చి తలదాచుకున్నారు. ఇప్పుడు అక్కడ కూడా ఆర్మీ దాడులు జరిపింది. రఫా వ్యాప్తంగా కమ్యూనికేషన్, ఇంటర్‌నెట్ సేవలు పూర్తిగా స్తంభించాయి. ప్రస్తుతం ఫిలడెల్ఫి కారిడార్‌పై మిలటరీ పట్టు సాధించింది. ఆ కారిడార్ పశ్చిమంగా లోపలకు ట్యాంకులు దూసుకువెళుతున్నాయని ఆ వర్గాలు తెలిపాయి. గతంలో ఉత్తర, సెంట్రల్ గాజా ప్రాంతాలపై దాడి చేసినపుడు రఫా నగరాన్ని సురక్షితమైన జోన్‌గా ఇజ్రాయిల్ మిలటరీ ప్రకటించింది. దాంతో గాజాలో దాదాపు సగానికి సగం మంది నిర్వాసితులు అక్కడకే చేరుకున్నారు. ఇప్పుడు అక్కడే దాడులు మొదలవడంతో ప్రాణనష్టం విపరీతంగా వుంటోంది. దాడులు మొదలైన తర్వాత దాదాపు 10లక్షల మంది రఫాను వీడినట్లు తెలుస్తోంది. రోజుకు 500 ట్రక్కులకు పైగా ఆహారం అవసరమవుతుండగా, గత మూడు వారాల్లో కేవలం 170 ట్రక్కుల సాయం మాత్రమే అందిందని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. సమీప భవిష్యత్తులో రఫా క్రాసింగ్‌ను తెరిచే అవకాశాలు కనిపించడం లేదని పాలస్తీనా ఆరోగ్య మంత్రి చెప్పారు. నిత్యావసరాలు, మందులు సరఫరాలకు ఈ క్రాసింగ్ కీలకం.

అమెరికా సిగ్గుమాలిన సమర్థన !

వాషింగ్టన్ : ఇజ్రాయిల్ చర్యలను ప్రపంచ దేశాలన్నీ ముక్త కంఠంతో ఖండిస్తున్నా అమెరికా మాత్రం నిస్సిగ్గుగా సమర్థిస్తూనే వస్తోంది. తాజాగా రఫాలో జరిపిన దాడిలో 45మంది అమాయకులు మరణించడంపై అంతర్జాతీయంగా ఖండనలు, విమర్శలు వస్తున్నా అమెరికా మాత్రం ఒక అడుగు ముందుకేసి ఇజ్రాయిల్ ఇంకా తాము విధించిన లక్ష్మణ రేఖను దాటలేదంటూ చెబుతోంది. పైగా ఆయుధాల సరఫరా ఆపేది లేదని తెగేసి చెప్పింది. అమెరికా జాతీయ భద్రతా ప్రతినిధి జాన్ కిర్బీ విలేకర్లతో మాట్లాడుతూ, ఇజ్రాయిల్ చర్యల ఫలితంగా తాము ఆ దేశం పట్ల అనుసరిస్తున్న విధానాల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. అవసరమైతే భవిష్యత్తులో ఆయుధాల బదిలీని ఆపుచేసేందుకు అధ్యక్షుడు జో బైడెన్ విధించిన 'రెడ్ లైన్'ను ఇజ్రాయిల్ ఇంకా దాటలేదని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో కూడా దాటదని అనిపిస్తోందని అన్నారు. ఎంతమంది పౌరులు చనిపోతే ఇజ్రాయిల్‌ను శిక్షించాలనేది నిర్ణయించడానికి కొలమానం అంటూ లేదని చెప్పారు. "రఫాలో జనాభా కేంద్రీకృతమైన ప్రాంతాల్లో ఇజ్రాయిల్ ఇంకా పెద్ద ఎత్తున ఎలాంటి సైనిక చర్యలు చేపట్టడం లేదు. పైగా ఆ దిశగా వారు కదలడం కూడా లేదు." అని కిర్బీ వ్యాఖ్యానించారు. అమాయకుల ప్రాణాలను కాపాడేందుకు ఇజ్రాయిల్ సాధ్యమైన ముందు జాగ్రత్తలు తీసుకుంటోందని చెప్పారు.

Chola Enter a better life

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: చోల క్రెస్ట్, సూపర్ బి, సి54 & సి55, 4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గ్యూండీ, చెన్నై-600 032, తమిళనాడు.

డిమాండ్ నోటీసు

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("ది యాక్ట్") మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("ది రూల్స్") క్రింద.
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (ది సెక్యూర్డ్ క్రెడిటర్) యొక్క అధీకృత అధికారిగా క్రింది సంతకందారు, చట్టం క్రింద మరియు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసులు జారీచేసి రూల్ 3తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా సదరు నోటీసుల్లో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరినారు. డిమాండ్ నోటీసుల బట్వాడాను నివారించుటకు రుణగ్రహీతలుకు క్రింది సంతకందారు డిమాండ్ నోటీసును గోడకు అతికించారు మరియు రూల్స్ ప్రకారం ప్రచురిస్తున్నారు. డిమాండ్ నోటీసుల్లో ఉన్న సమాచారం ఇందు దిగువ ఇవ్వబడుచున్నది:

రుణగ్రహీత& సహ-రుణగ్రహీతల పేరు& చిరునామా	రుణ మొత్తాలు	డిమాండ్ నోటీసు తేది& బకాయి మొత్తాలు	ఆస్తి/ సెక్యూర్డ్ అసెట్ వివరణ
రుణ ఖాతా నం.లు: LAP1JAE000056511. 1. శ్రీ/ శ్రీమతి రాజేశ్ తొర్లికొండ, 2. శ్రీ/శ్రీమతి తొర్లికొండ సామ్రాజ్యం, 3. శ్రీ/శ్రీమతి తొర్లికొండ గోపి. అందరి నివాసం: 33-3, అన్నాసాగరం శాంతి నగర్, ఎన్‌హెచ్-65 రోడ్ దగ్గర, అన్నాసాగరం, కృష్ణా-21185, ఆం.ప్ర; మరియు: 281-3/ డోర్ నం.33-3, అంజనయ్య స్వామి టెంపుల్ దగ్గర, నందిగామ ఎన్‌టిఆర్, కృష్ణా-521185, ఆం.ప్ర.,	₹ 16,00,000/-	28.05.2024 & 27.05.2024 నాటికి రూ.20,14,136/- (రూపాయలు ఇరువై లక్షల పద్నాలుగు వేల నూటా ముప్పై ఆరు మాత్రమే)	ఎన్‌టిఆర్ జిల్లా, నందిగామ మండలం, నందిగామ టౌన్, నందిగామ ఎస్.ఆర్.ఒ. పరిధిల్లో సర్వే నం.281-3లో 292.723చ.గ.ల విస్తీర్ణంతో అసెస్మెంట్ నం.1145003013గల డోర్ నం.33-3తో 825చ.అ.ల ప్లింత్ ఏరియాగల ఆర్‌సిసి భవనము, ఆర్‌సిసి(ఎల్& బి) ప్లింత్ ఏరియా 42చ.అ.లు వద్దగల ఆస్తి యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: టొర్లికొండ వేంకటేశ్వర రావు ఆస్తి, దక్షిణం: రోడ్డు, పడమర: తుటారి వేంకటేశ్వర రావు ఆస్తి, ఉత్తరం: తొర్లికొండ రామమూర్తి ఆస్తి, అన్ని ఈజిమెంట్ హక్కులతోసహా.

రుణగ్రహీతలను అనేకసార్లు డిమాండ్ నోటీసులు పంపి కోరినప్పటికీ బకాయి మొత్తాలను చెల్లించనందున, కోరునది ఏమనగా, ఈ ప్రచురణ తేదీ నుండి **60 రోజుల్లోగా** ఇందు పై పేర్కొన్న డిమాండ్ చేసిన మొత్తాలను వర్తించబడు వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ చార్జీలు, ఖర్చులు మరియు చెల్లించు రియలైజేషన్ తేదీ వరకు దానిపై వ్యయాలతో తిరిగి చెల్లించవలసిందిగా కోరబడుచున్నది. రుణగ్రహీతలు గమనించాల్సింది ఏమనగా, రుణగ్రహీతలచే వారి సెక్యూర్డ్ అసెట్స్‌గా స్థిరాస్తి/ఆస్తులపై సెక్యూర్డ్ డెట్స్‌కు సెక్యూర్డ్ క్రెడిటర్ నుండి రుణగ్రహీతలచే రుణ సదుపాయం పొందియున్నారని దయచేసి గమనించగలరు. సెక్యూర్డ్ క్రెడిటర్ సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనంచేసుకొనుటకు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అన్ని హక్కులను కలిగియున్నారు దానితోపాటు చట్టం క్రింద అందుబాటులోగల ఇతర అంశాల దృష్ట్యా అమ్మకం రూపేనా రుణగ్రహీతలు బదిలీచేయలేరు. సెక్యూర్డ్ క్రెడిటర్ అమ్మకం మరియు ట్రాన్స్‌ఫర్ హక్కులతో దానిని స్వాధీనంకు ముందు **అటాచ్ మరియు/లేదా సీలు**కు కూడా అధికారాలు కలిగియున్నారు. సెక్యూర్డ్ క్రెడిటర్‌కు చెల్లించాల్సిన బకాయిలు కవరుచేయుటకు అమ్మకం ద్వారా తగినన్ని మొత్తాలు రాని పిమ్మట
మిగతా బకాయిలను రాబట్టుటకు సెక్యూర్డ్ క్రెడిటర్ విడిగా లీగల్ ప్రొసీడింగ్ అమలుచేయ ఆస్కారం ఉంటుంది, మరియు ఏదేని ఇతర చట్టం క్రింద సెక్యూర్డ్ క్రెడిటర్‌కు అందుబాటులోగల అన్ని ఇతర రెమెడీస్ యొక్క అదనపు మరియు స్వతంత్రంగా రెమెడీ కలిగియుంటారు.
సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13(8)కు రుణగ్రహీతలు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది మరియు తదుపరి చట్టం యొక్క సెక్షన్ 13(13)తో రుణగ్రహీతలు సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేనిదే, ఆస్తులను అమ్మకం, లీజు, లేదా బదిలీచేయుట నుండి నిషేధింపబడినారు.మరియు ఎవరైనా సదరు నియమాలను ఉల్లంఘించినచో, సదరు చట్టం యొక్క సెక్షన్ 29 క్రింద శిక్ష పడుటకు బాధ్యులగుదురు. డిమాండ్ నోటీసు కాపీ క్రింది సంతకందారు వద్ద అందుబాటులో ఉంటుంది మరియు అవసరమైతే, రుణగ్రహీతలు దానిని సాధారణ పనిదినమున పనివేళల్లో క్రింది సంతకందారు నుండి సేకరించవచ్చును.

సం/-
ప్రదేశం: విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర.
అధీకృత అధికారి
తేది: 28.05.2024
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరపున

ఇ-యాక్షన్ సేల్ నోటీసు

ఇడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
CIN: U67100MH2007PLC174759
రిటైల్ సెంట్రల్ & రిజిస్టర్డు ఆఫీసు: ఇడెల్‌వీస్ హౌస్, ఆఫ్ సిఎస్‌టి రోడ్, కలీనా, ముంబయి-400098.

ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("రూల్స్") యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద హామీచూపిన స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-యాక్షన్ సేల్ నోటీసు.

ఇవ్వబడిన కాలంలో స్పష్టంగా పేర్కొన్న వివిధ ట్రస్టుల ట్రస్టీగా దీని సామర్థ్యం మేరకు ఇడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్‌కు సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క ఆర్థిక సదుపాయాలు అసైన్‌చేయబడినవి. సదరు అసైన్‌మెంట్ అనుసరించి, ఇఎఆర్‌సి అసైనర్‌లోకి అడుగుడినాది మరియు సెక్యూర్డ్ క్రెడిటర్‌గా దీని హక్కులను వినియోగిస్తుంది. ఇఎఆర్‌సి, సెక్యూర్డ్ క్రెడిటర్‌గా, దీని సామర్థ్యం మేరకు, షార్ఫసీ యాక్ట్ యొక్క 13(4) క్రింద మరియు దాని క్రింది రూల్స్ క్రింద దిగువ హామీ చూపిన సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనంచేసుకొన్నది.
ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత మరియు హామీదారులకు 30 రోజుల ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన హామీచూపిన స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటర్ పేరున తాకట్టుపెట్టబడినవి, సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క అధీకృత అధికారి (ఎఓ) ద్వారా భౌతిక స్వాధీనంచేసుకొబడి, రుణగ్రహీత మరియు హామీదారు నుండి ఇఎఆర్‌సి ద్వారా స్వీకరించిన ఏవేని సొమ్ము కొరకు తీసివేసిన తదుపరి వడ్డీ మరియు ఇతర వ్యయాలు/ఖర్చులతోసహా ఇఎఆర్‌సికి అందు పేర్కొనబడిన దిగువ బాకీయున్న మొత్తాలను రికవరీచేయుట కొరకు **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది అది అక్కడ అలాగే"** ప్రాతిపదికన **విక్రయించబడుతుంది.** ప్రతి ఆస్తి కొరకు రిజర్వు ధర మరియు ధరావత్తు డిపాజిట్ ఇందు దిగువ పేర్కొనబడినవి.

వేలం కొరకు పెట్టిన సెక్యూర్డ్ అసెట్ వివరాలు:

క్ర. సం.	రుణ ఖాతా నం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు	ట్రస్ట్ పేరు	బ్యాంకు& బ్రాంచి పేరు, రుణఖాతా నంబరు& ఐఎఫ్‌ఎస్‌సి కోడ్	29.05.2024 నాటికి పూర్తి బకాయి మొత్తాలు రూ.లలో	రిజర్వు ధర (రూ.లలో)	ధరావత్తు (ఇఎండి) రూ.లలో	వేలం తేది & సమయం	స్వాధీనం విధానం
3.	LVIJSTH 00000240 01/EHFL	1.శ్రీ మర్దాని అప్పారావు (రుణగ్రహీత) 2. శ్రీ వెంకట రమణ మర్దాని (సహ-రుణగ్రహీత)	EARC TRUST SC 459	ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 000405134157 ICIC0000004 నారిమన్ పాయింట్	Rs. 28,02,202.33	Rs. 14,00,000/-	Rs. 1,40,000/-	02.07.2024 at 3:00 PM	భౌతికం

తాకట్టుపెట్టిన ఆస్తి వివరణ: షెడ్యూలు-ఎ: పటమట సబ్-రిజిస్ట్రార్, కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, కానూరు గ్రామం& గ్రామపంచాయతి యొక్క ఎల్.పి.నం.70/81 లో ప్లాట్ నం.7గల ఆస్తి, విస్తీర్ణం 382చ.గ.లు లేదా 320.05చ.మీ.లు డోర్ నం.18-368. సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నం. 8-65.00అ.లు, దక్షిణం: 33అ.ల వెడల్పు రోడ్డు-65.00అ.లు, తూర్పు: 33అ.ల వెడల్పు రోడ్డు-53.00అ.లు, పడమర: 6-53:00అ.లు.
షెడ్యూలు -బి: పటమట సబ్-రిజిస్ట్రార్ పరిధిలో ఆమోదిత నం.4-214/14 తేది: 12.11.2014, సాయి సాధన కానూరు గ్రామం& గ్రామపంచాయతి యొక్క 1వ అంతస్తు, ఫ్లాట్ నం. మొదటి అంతస్తు-4గల ఆస్తి విస్తీర్ణం 30చ.గ.ల విడదీయలేని భాగం, ప్లింత్ ఏరియా 663చ.అ.లు, బాల్కని ఏరియా 163చ.అ.లు ఉమ్మడి ఏరియా 83చ.అ.లుతోపాటు 100చ.అ.ల కార్ పార్కింగ్, షెడ్యూలు ఎలో అన్ని ఈజిమెంట్ హక్కులన్నింటితో అసంపూర్తి స్థితిలో ఉన్న ఆస్తి. **సరిహద్దులు: ఉత్తరం:** ఒపెన్ టు స్కై, **దక్షిణం:** ఫ్లాట్ నం.3 & ఫ్లాట్ నం.4 కొరకు ఉమ్మడి గోడ, **తూర్పు:** ఒపెన్ టు స్కై, **పడమర:** ఉమ్మడి కారిడార్& ఉమ్మడి దారి.

వేలం ప్రక్రియకు చెందిన ముఖ్యమైన సమాచారం:

1	డ్రాఫ్టులన్నీ కూడా ముంబయి వద్ద చెల్లుబడునట్టుగా పై పేర్కొన్న ట్రస్ట్ పేరున తీయవలెను.	
2	ధరావత్తు దాఖలుచేయుటకు చివరి తేది	వేలం తేదీకి ముందు 1 రోజున స్వీకరించబడును
3	బిడ్స్ సమర్పించుట కొరకు ప్రదేశం	1వ అంతస్తు, ఇడెల్‌వీస్ హౌస్, కలిన, ముంబయి-400098
4	వేలం ప్రదేశం (వేలం కొరకు వెబ్‌సైట్)	ఇ-వేలం (https://auction.edelweissarc.in)
5	ఫోన్ నం.లతో సంప్రదించాల్సిన వ్యక్తుల పేర్లు	కస్టమర్ కేర్: 1800 266 6540
6	ఆస్తి పరిశించు తేది& సమయం	ముందస్తు అనుమతి ప్రకారం

అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& నిబంధనల కొరకు, దయచేసి ఇఎఆర్‌సి యొక్క వెబ్‌సైట్ అనగా.,https://auction.edelweissarc.in లో ఇవ్వబడిన లింకును రెఫర్‌చేయండి.

ప్రదేశం: ముంబయి
తేది: 29.05.2024
సం/- అధీకృత అధికారి
ఇడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ తరపున

Edelweiss Asset Reconstruction

IKF Finance Limited
Regd. Off.: #40-1-144, Corporate Centre, M.G. Road, VIJAYAWADA – 520 010
Phone: 91-866-2474644/2474633 **Fax**: 91-866-2485755
Email: ikffinance@gmail.com **Website**: ikffinance.com **CIN**: U65992AP1991PLC012736

Statement of Audited Standalone Financial Results for the Quarter and Year ended March 31,2024

Rs. in Lacs

S. No.	Particulars	Quarter Ended: March 31, 2024 (Audited) (Ref Note 9)	Quarter Ended: December 31, 2023 (Reviewed)	Quarter Ended: March 31, 2023 (Audited) (Ref Note 9)	Year Ended: March 31, 2024 (Audited)	Year Ended: March 31, 2023 (Audited)
1	**Revenue from operations**					
	(a) Interest income	13542.29	11,056.12	8,534.39	43,304.01	28,398.32
	(b) Fees and commission income	21.31	33.55	30.23	98.89	93.92
	(c) Other Operating Income	17.00	1.07	1.77	19.64	3.20
	Total revenue from operations	**13,580.60**	**11,090.74**	**8,566.40**	**43,422.53**	**28,495.44**
2	Other income	152.45	21.36	99.13	325.04	164.24
3	**Total income (1 + 2)**	**13,733.05**	**11,112.10**	**8,665.53**	**43,747.57**	**28,659.68**
4	**Expenses**					
	(a) Finance costs	6242.57	5,784.11	4,758.33	22,022.85	15,402.63
	(b) Impairment on financial instruments	492.42	495.30	-227.36	1,640.51	539.85
	(c) Employee benefits expenses	2306.50	1,737.65	1,321.69	7,329.16	4,297.44
	(d) Depreciation, amortization and impairment	115.96	76.06	71.16	340.89	264.23
	(e) Others expenses	573.83	525.07	438.65	2,076.54	1,424.80
	Total expenses	**9,731.28**	**8,618.19**	**6,362.47**	**33,409.94**	**21,928.95**
5	**Profit before tax (3 - 4)**	**4,001.77**	**2,493.91**	**2,303.06**	**10,337.63**	**6,730.73**
6	**Tax expenses**					
	(a) Current tax	715.83	759.26	379.77	2,600.55	1,461.47
	(b) Deferred tax	302.42	-127.46	202.66	30.82	255.84
	(c) Adjustment of tax relating to earlier periods	0.00	0.03	12.47	8.82	12.91
7	**Net Profit for the period (5 - 6)**	**2,983.52**	**1,862.08**	**1,708.16**	**7,697.44**	**5,000.51**
8	**Other comprehensive income**					
	(A) Items that will not be reclassified to profit or loss					
	(a) Remeasurements of the defined benefit plans	-9.94	8.65	6.94	-4.36	13.18
	(b) Income tax relating to items that will not be reclassified to profit or loss	2.50	-2.18	-1.75	1.10	-3.32
9	**Total Comprehensive Income (7 + 8)**	**2,976.08**	**1,868.55**	**1,713.35**	**7,694.18**	**5,010.37**
10	**Earnings per Share (Rs) (Face Value of Rs.10/- each)**					
	- Basic (Not Annualised)	**4.39**	**2.77**	**3.18**	**11.32**	**9.31**
	- Diluted (Not Annualised)	**4.39**	**2.77**	**3.18**	**11.32**	**9.31**

Note
1. The above is an extract of the detailed format of Quarter ended and the year Ended March 31, 2024 financial results filed with the Stock Exchanges under Regulation 52 of the SEBI (Listing and Other Disclosure Requirements) Regulations, 2015. The full format of the Quarter ended and Year Ended March 31, 2024 Financial results are available on the websites of the Stock Exchange(s) and the Company's Website www.ikffinance.com
2 The above financial results are reviewed and recommended by the Audit Committee and have been approved by the Board of Directors of the Company at their meeting held on May 29, 2024.
3 Previous period figures have been regoruped/ reclassified wherever required.

For and on behalf of the Board of Directors
Vasumathi Devi Koganti
Managing Director
Place : Hyderabad
Date : May 29, 2024

నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరుగలది)
రిజిస్టర్డు ఆఫీసు: 5వ అంతస్తు, టవర్-3, వింగ్-బి, కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్, కుర్లా (వెస్ట్), ముంబయి-400070. రీజినల్ ఆఫీసు: 3వ& 4వ అంతస్తు, శ్రీ ప్రశాంతి సాయిటవర్స్, ప్లాట్ నెం.68, మున్సిపల్ నెం.8-2-248, నాగార్జున హిల్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, పంజగుట్ట దగ్గర, హైదరాబాద్-500082

nido HOME FINANCE

ఇ-వేలం-చట్టబద్ధ 30 రోజుల అమ్మకపు ప్రకటన

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 క్రింద ఇ-వేలం ద్వారా అమ్మకం.
ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమగనా, దిగువ పేర్కొన్న ఆస్తిని రుణ బకాయిలను రికవరీచేయు వరకు పట్టికలో పేర్కొన్నట్లుగా మొత్తాలను రికవరీచేయుట కొరకు **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది"** ప్రాతిపదికన విక్రయించబడుతుంది. సదరు ఆస్తినిరుణగ్రహీత(లు), సహ-రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)చే పొందిన రుణం కొరకు **నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరుగలది)**కు సదరు ఆస్తిని తాకట్టుపెట్టుట జరిగింది. దిగువ పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్‌ను సెక్యూర్డ్ క్రెడిటర్ లాంఛనప్రాయంగా స్వాధీనంచేసుకున్నారు.

క్ర సం.	రుణగ్రహీత(లు)/ సహ-రుణగ్రహీత(లు)/ హామీదారు/(ల) పేరు	రికవరీ మొత్తాలు	రిజర్వు ధర& ధరావత్తు	వేలం తేది& సమయం	తనిఖీచేయు తేది& సమయం	స్వాధీనతా తేది
2.	దుపాటి శ్రీకాంత్ (రుణగ్రహీత), దుపాటి అనూష (సహ-రుణగ్రహీత)	లాన్ నెం. LVIJSBI0000095925 కొరకు 28.05.2024 నాటికి రూ.15,62,471.05/- (రూపాయలు రూపాయలు పదిహేను లక్షల అరవైరెండువేల నాలుగువందల డెబ్భైఒకటి & ఐదు పైసలు మాత్రమే) + దానిపై తదుపరి వడ్డీ+ లీగల్ వ్యయాలు.	రూ.20,25,000/- (రూపాయలు ఇరవైలక్షల ఇరవైఐదువేలు మాత్రమే). ధరావత్తు డిపాజిట్: రూ.2,05,500/- (రూపాయలు రెండు లక్షల ఐదువేల ఐదువందలు మాత్రమే)	16.07.2024 ఉ॥ 11గం.ల నుండి మ॥ 12గం.ల మధ్య (5 నిమిషాల అపరిమిత ఆటో పొడిగింపుతో)	10-07-2024 between 11.00 am to 3.00 pm	15-05-2024

సెక్యూర్డ్ అసెట్ వివరణ: అసిస్ట్ నెం.216188 న్యూ, మున్సిపల్ వార్డ్ నెం.27, ఎన్‌టిఎస్ 80 బ్లాక్ 4, లబ్బీపేట్, విజయవాడ-520010 లోని 35 చ.గ.ల విస్తీర్ణపు డోర్ నెం.40-1-145/1, గ్రౌండ్ ఫ్లోర్ జి-2 కలిగిన మొత్తం భాగం. **సరిహద్దులు: ఉత్తరం:** నందిగాం సమాధానం ఆస్తి, **దక్షిణం:** దూపాటి అబ్రహం ఆస్తి, **తూర్పు:** 6.0 అడుగుల వెడల్పు బజార్, **పడమర:** నందిగాం విలియం ఆస్తి.

గమనిక: 1) వేలం అమ్మకంను వెబ్‌సైట్: https://sarfaesi.auctiontiger.net ద్వారా ఆన్‌లైన్ నిర్వహించబడుతుంది మరియు అట్టి బిడ్డరుదారులు వాలిడ్ ఇమెయిల్, ఐడి ప్రూఫ్& ఫోటో ప్రూఫ్, పాన్ కార్డు మరియు డిమాండ్ డ్రాఫ్టు/ఎన్‌ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్ ద్వారా ధరావత్తు చెల్లించుట ద్వారా ఈ **"ఆన్-లైన్ వేలం"**లో పాల్గొవలెను. **2)** ఆసక్తిగల బిడ్డరుదారులు వారి ధరావత్తును డిమాండ్ డ్రాఫ్ట్/ఎన్‌ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్ రూపేనా దాఖలుచేయవలెను: **3) లబ్ధిదారు పేరు: నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఖాతా నెం.65226845199, SARFAESI- ఆక్షన్, ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్:** SBIN0001593. **4)** ధరావత్తుతోపాటు ఆన్‌లైన్ దరఖాస్తు బిడ్ ఫారం దాఖలుచేయుట కొరకు చివరి తేది: **15-07-2024)** అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& షరతుల కొరకు, దయచేసి దర్శించండి: వెబ్‌సైట్: https://sarfaesi.auctiontiger.net లేదా దయచేసి సంప్రదించండి: **శ్రీమౌలిక్ శ్రీమాలి, ఫోన్: +91-6351896643/ 9173528727,** హెల్ప్‌లైన్ ఇమెయిల్ ఐడి: Support@auctiontiger.net

మొబైల్ నెం.7207645328/8885161710/8885462308
తేది: 30-05-2024
సం/- అధీకృత అధికారి,
నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరుగలది)

వేసవి విడిది

చరవాణి



చరవాణితో మానవ స్నేహం
ఇది ఒక కృత్రిమ బంధం
దీనితో దీర్ఘకాలిక స్నేహం
దూరం చేయును సత్సంబంధం
దీనితో అధిక సాంగత్యం
గతింపజేయును విలువైన సమయం
దీనితో చెడు సాంగత్యం
నిర్మూలించెను బాహ్య అంతరంగ అందం
దీని సద్వినియోగం వల్ల కలుగును ఆనందం
దుర్వినియోగం వల్ల పడును జీవితానికి రంధ్రం




- పి.జాన్‌పాల్,
ఇంటర్మీడియట్, ఏపీ మోడల్ స్కూలు,
సిబెలగల్ మండలం, కర్నూలు జిల్లా.

బొమ్మరిల్లు




ఎం.జస్మిత,
6వ తరగతి,
వశిష్ఠ
ఇంగ్లీష్ మీడియం
స్కూల్,
మదనపల్లె.








వి వైష్ణవి రెడ్డి,
9వ తరగతి,
డిజి పేట,
సిఎస్‌పురం మండలం,
ప్రకాశం జిల్లా.



బహుమానం

మహాబలేశ్వరం అనే రాజ్యంలో రామలింగం అనే తెలివైన పండితుడు ఉన్నాడు. ఆయనకు భార్య రుక్మిణి, తల్లి సుజాత, కొడుకు వెంకటేశం ఉన్నారు. ఒక రోజు మహాబలేశ్వరం రాజు దసరా పర్వదినం సందర్భంగా ఆస్థానంలో కవితా పోటీలు ఉంటాయని ప్రకటించారు. గెలుపొందిన వారికి ఊహించని బహుమతులు కూడా ఉంటాయని చెప్పారు.

రామలింగం భార్య అత్యాశపరురాలు. 'ఏమండీ మీరు కూడా కవితా పోటీల్లో పాల్గొనండి. ఎంచక్కా వచ్చిన బహుమతితో నేను వజ్రాల ఉంగరాలు, రవ్వల నెక్లెస్ చేయించుకుంటాను. ఇంకా పట్టు చీరలు కావాలి' అంది. అప్పుడు సుజాతమ్మ 'ఏమే కోడలా, అది బహుమతి కాదే బహుమతులు. నీవు ఒక్క దానివే నగలన్నీ చేపించుకుంటావా. నాకు కూడా బంగారు గాజులు, పట్టుచీర కావాలి' అంది. అప్పుడే వచ్చిన వెంకటేశం 'నాకు కూడా బంగారు గొలుసులు కావాలి' అన్నాడు. వారి మాటలు విని రామలింగం నవ్వుకున్నాడు.



'నేను ఇంకా పోటీలో పాల్గొనేనలేదు. మీరు అత్యాశతో అన్ని కోరికలు కోరుకుంటున్నారు. అయినా ఒక కవికి కావలసినవి బంగారు ఆభరణాలు కాదు. అతడు తన రచనల ద్వారా సమాజంలో మార్పు కోరుకుంటాడు. మేము రాసే కవితలు సమాజ హితం కోసం మాత్రమే' అని రామలింగం అన్నాడు.

అనుకున్నట్టుగానే దసరా పండుగ రోజున కవితా పోటీ జరిగింది. రామలింగం విజేతగా నిలిచాడు. ఆ తర్వాత రాజాజ్ఞ మేరకు సేవకులు బహుమతులను పెద్ద పళ్ళెంలో ఒక ఎర్ర వస్త్రం కప్పి సభా మందిరంలోకి తీసుకొచ్చారు. ఆ పళ్లెంలో బంగారు ఆభరణాలు ఉంటాయని రామలింగం తల్లి, భార్య ఆశగా ఎదురుచూశారు. అయితే, ఆ పళ్లెంలో నుంచి వస్త్రం తీయగానే వారి ముఖాలు వాడిపోయాయి. రామలింగం ముఖం మాత్రం వెలిగిపోయింది. ఆ పళ్లెంలో – ఒక కలం, సిరా డబ్బా, తెల్ల కాగితాలు, కొన్ని ముద్రిత పుస్తకాలు ఉన్నాయి. బహుమతి ఎలా ఉందని రాజు రామలింగంను అడిగాడు. 'రాసుకోవడానికి కలం, పేపర్లు, విషయ పరిజ్ఞానం పెంచుకోవడానికి మంచి పుస్తకాలను అందించారు. ఒక కవికి ఇంత కంటే ఇంతకంటే విలువైన బహుమతి ఏముంది?" అని సంతోషంగా అన్నాడు. ఆ మాటలతో రామలింగం కుటుంబ సభ్యులు తాము అత్యాశతో ఆలోచించామని సిగ్గుపడ్డారు. ఆ తర్వాత రాజు రామలింగంను శాలువా, గజమాలతో సన్మానించి, బంగారు నాణేలను బహుమతిగా ఇచ్చి నమస్కరించాడు.

- ఎం.డి. అస్మిన్,
ఇంటర్ సెకండ్ ఇయర్,
జగదేవ్ పేట, జగిత్యాల జిల్లా.

గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా ప్రతిరోజూ 'వేసవి విడిది' ముస్తాబై వస్తోంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లూ మెయిల్‌కి లేదా
వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.
మెయిల్ ఐడీ : chinnaarips@gmail.com
– ఎడిటర్

జీవన the family


మేము కూడా జీవించడానికి అర్హులం..

చిరునవ్వులు చిందిస్తూ, చిట్టిచిట్టి చేతుల్తో రంగుల ప్రపంచాన్ని సృష్టిస్తున్న ఈ పిల్లలు పాలస్తీనా చిన్నారులు. ఈ పిల్లల కళ్లెదుటే కన్నవారు మంటల్లో మాడి మసైపోయారు. తమతోటి ఆడి, పాడిన స్నేహితులు రక్తపుముద్దలుగా మారిపోయారు. చదువు నేర్పిన టీచరమ్మ కూలిన భవంతుల కింద ఆనవాళ్లు గుర్తించనంతగా ఛిద్రమైపోయింది. ఇంతటి భయానక వాతావరణంలో వీరంతా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వారి ముఖాల్లో నవ్వు కనిపించి కొన్ని నెలలు అయ్యింది. కంటి నిండా నిద్ర లేదు. కళ్లు మూసినా, తెరిసినా తమ వాళ్ల జ్ఞాపకాలే. ఈ పరిస్థితిలో మార్పు తేవాలంటే ఏ ఒక్కరి వల్ల కాదు. లాలించే అమ్మ లేక, నడిపించే నాన్న లేక ఆడుకునే స్నేహితులు రాక ఒంటరి అయిన ఈ చిన్నారులకు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది పాలస్తీనాకు చెందిన 'కల్చర్ అండ్ ఫ్రీ థాట్ అసోసియేషన్' (సిఎఫ్‌టిఎ). ఈ సంస్థ పిల్లల చేతికి రంగురంగుల కుంచెలు ఇచ్చింది. వాటితో తమ దేశ వారసత్వ సంపద ఆనవాళ్లను చిత్రించమంది. ఇంకేముంది.. పిల్లలంతా తమ కలలకు రెక్కలు తొడిగారు. 'జీవించడానికి మేమూ అర్హులమే.. అవును మేము అర్హులం' అంటూ శిథిలమైన ఎన్నో సాంస్కృతిక చిహ్నాలకు సజీవ రూపం ఇస్తున్నారు.



పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి చేయడం మొదలుపెట్టినప్పటి నుండి, గాజాలో సగానికి పైగా ఇళ్లు నేలకొరిగాయి. 267 పైచిలుకు సాంస్కృతిక వారసత్వ చిహ్నాలు శిథిలమైపోయాయి. ఈ పరిస్థితుల్లోనే రఫాలో శరణార్థ శిబిరంలో తలదాచుకుంటున్న ఈ చిన్నారులు తమ దేశ వారసత్వ సంపదను సజీవంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారు.

'బాంబులు, రక్తం, శవాలదిబ్బలు, కూలిపోతున్న భవంతులు, ఆర్తనాదాలు, ఆకలి కేకల మధ్య, ఈ పిల్లల బాల్య మధుర స్మృతులన్నీ కల్లలైపోయి, బతికున్న శవాల్లా జీవిస్తున్నారు. ఈ వాతావరణం ఇంకొన్నాళ్లు ఉంటే పరిస్థితి చేయి దాటిపోతుంది. తీవ్ర మానసిక క్షోభతో తల్లడిల్లిపోతారు. వారి ఆశలను, కలలను తిరిగి బతికించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అందుకే మేము ఈ ప్రయత్నం చేస్తున్నాం. ఏప్రిల్ నెల నుండి ఆర్ట్ సెషన్లు నిర్వహిస్తున్నాం. నిశ్శబ్దంలో కూరుకుపోయిన ఎందరో చిన్నారులు ఈ సెషన్లలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా మేము వారికో టాస్క్ ఇచ్చాం. యుద్ధం వల్ల శిథిలమైపోయిన చారిత్రక కట్టడాలను చిత్రించమని కోరాం. ఆశ్చర్యంగా ఈ పిల్లలంతా అద్భుత ప్రతిభ ప్రదర్శించారు. రంగు పెన్సిళ్లు, క్రేయాన్లతో ఆ కట్టడాలకు సజీవ రూపం ఇచ్చారు' అంటున్నారు కమ్యూనిటీ మొబలైజర్ బుథైన్ అల్ ఫఖ్వి.







చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థులు మొదట నిరాశ, నిస్పృహలతో ఉన్నారు. బొమ్మలు గీయడం మొదలుపెట్టినప్పటి నుండి, వారికి జీవితంపై ఆశ పుట్టింది. 13 ఏళ్ల సఫా, తను చిత్రించిన, గాజాలోని ఒకానొక పురాతన కట్టడం, 'ఖసర్ అల్ బాషా' చిత్రాన్ని చూపుతున్నప్పుడు ఆమె కళ్లల్లో ఓ మెరుపు కనిపిస్తోంది. ఈ కట్టడాన్ని 'పాషా' ప్రాంతంగా పిలుస్తారు. 13వ శతాబ్దపు ఈ కట్టడంలో కొంత భాగాన్ని మ్యూజియంగా, మరికొంత భాగాన్ని బాలికల ఉన్నత పాఠశాలగా తీర్చిదిద్దారు. ఇజ్రాయిల్ దాడిలో ఈ కట్టడం ఇప్పుడు పూర్తిగా శిథిలమైంది.

అలాగే గాజా సిటీలోని మరో గొప్ప కట్టడం 'ఒమ్రి మసీదు' కూడా చిన్నారుల వర్క్‌షాపులో మళ్లీ పునరుద్ధరించబడింది. 13 ఏళ్ల ఇబ్తిసమా అందమైన నీలాకాశపు నీడలో పసుపు, ఎరుపు రంగుల కలయికతో ముద్రించిన 'ఒమ్రీ మసీదు'ని చూపిస్తోంది. గాజాలోనే గొప్ప మసీదుగా పేరుగాంచిన ఆ కట్టడం ప్రస్తుత ఇజ్రాయిల్ దాడుల్లో పూర్తిగా ధ్వంసమైంది.

ఇలా ప్రతి ఒక్క చిన్నారి ఈ ఆర్ట్ వర్క్ షాపులో పాల్గొని, తమ కలలకు రెక్కలు తొడుగుతున్నారు. యుద్ధం నుండి కాస్తంత విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితే ఈ విశ్రాంతి తాత్కాలికమైనది. తక్షణ, శాశ్వత కాల్పుల విరమణ మాత్రమే ఈ పిల్లలను వారు జీవిస్తున్న నేలపై ప్రశాంత జీవితానికి కారణమవుతుంది.



నల్లమడ డ్రెయిన్ వాగులో నలుగురు గల్లంతు

- తండ్రీకొడుకుల మృతదేహాలు లభ్యం
- మరో ఇద్దరు గల్లంతు

ప్రజాశక్తి - బాపట్ల



గల్లంతయిన వారి కోసం గాలిస్తున్న పోలీసులు

బాపట్ల జిల్లా బాపట్ల-పొన్నూరు రహదారి మార్గంలో అప్పికట్ల సమీపంలో నల్లమడ డ్రెయిన్ వాగులో స్నానాలకు దిగి నలుగురు గల్లంతయ్యారు. వారిలో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో ఇద్దరి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బాపట్ల డిఎస్‌పి మురళీకృష్ణ కథనం మేరకు.. బాపట్లకు చెందిన దరబడి సునీల్.. హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. సునీల్, తమ బంధువులు, స్నేహితులు మొత్తం 12 మంది కలిసి బాపట్లలోని తమ బంధువుల వద్దకు.. ఆ తర్వాత సూర్యలంక బీచ్‌కు వెళ్లామని నిర్ణయించుకుని హైదరాబాద్ నుంచి బయలుదేరారు. ఈ నెల 27న పొన్నూరు మండలం వడ్డి ముక్కలకు చేరుకున్నారు. 28న అదే మండలంలో మునిపల్లె గ్రామంలోని తమ బంధువులను పరామర్శించారు. 29న మునిపల్లె నుంచి పర్చూరు మండలం వీరన్నపాలెంకు బయలుదేరారు. మార్గమధ్యంలో అప్పికట్ల-బాపట్ల మార్గంలో నల్లమడ డ్రెయిన్ (నాగరాజుకాల్వ)లో స్నానాలు చేసేందుకు నలుగురూ కాలువలోకి దిగారు. నీటి ప్రవాహ ఉధృతికి అనురాజ్ (సన్ని) (11) కొట్టుకుపోయారు. కుమారుడిని రక్షించేందుకు అతని తండ్రి దరబడి సునీల్‌కుమార్ (37) కాలువలోకి దిగారు. అతను కూడా కొట్టుకుపోవడంతో వీరిద్దరిని రక్షించే క్రమంలో కిరణ్‌గౌడ్ (30), నందు (30) గల్లంతయ్యారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సునీల్‌కుమార్, అనురాజ్ మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన నందు, కిరణ్ కోసం రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

31న ప్రజ్వల్ రేవణ్ణ అరెస్టు!

బెంగళూరు: లైంగిక నేరాల కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న హసన్ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణను శుక్రవారం అరెస్టు చేయనున్నారు. ఈ విషయాన్ని కర్ణాటక హోం మంత్రి జి. పరమేశ్వర బుధవారం వెల్లడించారు. ప్రస్తుతం పరారీలో ఉన్న ప్రజ్వల్ రేవణ్ణ శుక్రవారం ఉదయానికి బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. దీంతో విమానాశ్రయంలోనే ప్రజ్వల్‌ను అరెస్టు చేస్తామని మంత్రి తెలిపారు. 'ప్రజ్వల్‌పై అరెస్టు వారెంట్ జారీ కావడంతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అతన్ని అరెస్టు చేస్తుంది' అని మంత్రి చెప్పారు. సిట్ ఇప్పటికే విమానాశ్రయంలో మోహరించి ఉన్నట్లు తెలిపారు. లైంగిక వేధింపులు వీడియో బయటకు రాగానే ఏప్రిల్‌లో ప్రజ్వల్ రేవణ్ణ విదేశాలకు పారిపోయిన సంగతి తెలిసిందే. అయితే మే 31న ఉదయం 10 గంటలకు సిట్ ఎదుట హాజరవుతానని ఎంపి ఇటీవల ప్రకటించారు. ఈ కేసులో దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానంటూ సోమవారం విడుదల చేసిన ఓ సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు.

కాగా, జెడి(ఎస్) ఎంపి దాఖలు చేసిన పిటీషన్ విచారణను కోర్టు ఈ నెల 31కు వాయిదా వేసింది. ప్రజ్వల్ రేవణ్ణ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు బుధవారం విచారించింది.

ప్రాక్టీస్.. ప్రాక్టీస్...

- టైటిల్ ఫేవరెట్‌గా టీమిండియా
- టి20 ప్రపంచకప్‌కు సన్నద్ధం
- 1న బంగ్లాదేశ్‌తో ఏకైక ప్రాక్టీస్ మ్యాచ్

న్యూయార్క్: ఐసిసి టి20 ప్రపంచకప్‌కు టీమిండియా ఆటగాళ్లు సిద్ధమౌతున్నారు. జట్టు సభ్యులంతా న్యూయార్క్‌కు చేరుకోవడంతో బుధవారం ఆటగాళ్లంతా ప్రాక్టీస్‌లో నిమగ్నమయ్యారు. టి20 ప్రపంచకప్‌కు ముందు టీమిండియా ఏకైక వార్మప్ మ్యాచ్‌ను బంగ్లాదేశ్‌తో జూన్ 1న తలపడనుంది. ఈ మ్యాచ్ న్యూయార్క్ వేదికగా జరగనుంది. ప్రాక్టీస్ సందర్భంగా జట్టు బలాబలాలు, బలహీనతలు, అవకాశాల గురించి కెప్టెన్, కోచ్ ప్రధానంగా దృష్టి సారించారు. ఇక టీమిండియా టి20 ప్రపంచకప్‌లో మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. చాలాకాలంలో టీమిండియాకు అందని ద్రాక్షలా ఉన్న ఐసిసి ట్రోఫీని ఈసారి తప్పక సాధించాలన్న దృఢ సంకల్పంతో ఆటగాళ్లంతా కసరత్తు చేస్తున్నారు. ఐసిసి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్లోకి రెండుసార్లు ప్రవేశించిన టీమిండియా రెండుసార్లు ఫైనల్లోకి చతికిలపడి రన్నరప్‌కే పరిమితమైంది. అలాగే 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరిన టీమిండియా.. ఆసీస్ చేతిలో ఓడింది. ఇక 2022 టి20 ప్రపంచకప్ ఫైనల్‌కు చేరుకోవడంలో టీమిండియా విఫలమైంది. ఈ క్రమంలో 9వ టి20 ప్రపంచకప్‌లో టీమిండియా టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఈ టోర్నీకి ఆతిథ్యమిస్తున్న అమెరికా, వెస్టిండీస్ పిచ్‌లు పేసర్లకు స్వర్గధామాలు. ఈ ఏడాది జనవరిలో బెంగళూరు వేదికగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన టి20లో టీమిండియా 212 పరుగుల భారీ స్కోర్‌ను కాపాడుకోలేకపోయింది. చివరకు సూపర్ ఓవర్లో గెలిచి ఊపిరి పీల్చుకుంది. ఈ క్రమంలో టి20 ఫార్మాట్‌లో భారీస్కోర్లు నమోదైనా ఫలితం ఏ నిమిషంలోనైనా తరుమారయ్యే అవకాశముంది.



ఆటగాళ్లు లేక.. కోచ్, చీఫ్ సెలక్టర్లు కూడా..

మరో మూడురోజుల్లో టి20 ప్రపంచకప్ ప్రారంభం కానుండగా.. ఆస్ట్రేలియా ఆటగాళ్లు ఇంకా న్యూయార్క్‌కు చేరుకోలేదు. దీనికి ప్రధాన కారణం కొందరు ఆటగాళ్లు ఐపిఎల్‌లో ఆడటం కాగా.. మరికొందరు గాయాలబారిన పడడం. బుధవారం నమీబియాతో జరగాల్సిన వార్మప్ మ్యాచ్‌కు ఆస్ట్రేలియాకు కనీసం 11మంది కూడా అందుబాటులో లేకుండాపోయారు. దీంతో నమీబియాతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో ఆసీస్ చీఫ్ సెలక్టర్ జార్జ్ బెయిలీ, ప్రధాన కోచ్ ఆండ్రూ మెక్ డొనాల్డ్ మైదానంలోకి దిగారు. వారితోపాటు ఇతర సహాయక సిబ్బంది కూడా ఫీల్డింగ్ చేశారు. జూన్ 5లోగానే కమిన్స్‌తోపాటు ఇతర క్రికెటర్లు విండీస్‌కు చేరుకుంటారు. ఆ రోజే ఆస్ట్రేలియా జట్టు ఒమన్‌తో గ్రూప్ లీగ్ తొలి మ్యాచ్ ఆడనుంది. ఇక ఐపిఎల్‌లో పెద్దగా ఆకట్టుకోని డేవిడ్ వార్నర్ తన మునుపటి ఫామ్‌ను అందుకున్నాడు. ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు ఏడు వికెట్ల తేడాతో నమీబియాను చిత్తుచేసింది. పోర్ట్‌స్పెయిన్ వేదికగా జరిగిన వార్మప్ మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన నమీబియా 20ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 119 పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా జట్టు 10ఓవర్లలో కేవలం 3వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. వార్నర్(54నాటౌట్)అర్ధసెంచరీకి తోడు టిమ్ డేవిడ్(23), వేడ్(12నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. నమీబియా బ్యాటర్లలో వికెట్ కీపర్ గ్రీన్(36) బ్యాటింగ్‌లో రాణించగా.. ఆసీస్ బౌలర్లు జంపాకు మూడు, హేజిల్‌వుడ్‌కు రెండు వికెట్లు దక్కాయి. నమీబియాను 119/9 స్కోరుకే కట్టడి చేసిన ఆసీస్.. లక్ష్య ఛేదనలో కేవలం 10 ఓవర్లలోనే పూర్తి చేసింది. డేవిడ్ వార్నర్ 21 బంతుల్లో 54 పరుగులు చేశాడు. టిమ్ డేవిడ్ (23), మ్యాథ్యూ వేడ్ (12లి) దంచేశారు. ఈ మ్యాచ్ ఫీల్డింగ్ సమయంలో కెప్టెన్ మిచెల్ మార్ష్ గాయం కారణంగా మధ్యలోనే డగౌట్‌కు వెళ్లాడు. అయితే, తన ఇంజూరీ పెద్ద సమస్య కాదని ఆ తర్వాత మార్ష్ వెల్లడించాడు.

కేజ్రీవాల్ పిటిషన్ స్వీకరణకు సుప్రీం నిరాకరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించలేదు. సిఎం కేజ్రీవాల్ ఆరోగ్య పరీక్షల కోసం మధ్యంతర బెయిల్‌ను మరో ఏడు రోజుల పాటు పొడిగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో అరవింద్ కేజ్రీవాల్ జూన్ 2న లొంగిపోవాల్సి ఉంటుంది. సాధారణ బెయిల్ కోసం దిగువ కోర్టును ఆశ్రయించే స్వేచ్ఛ కేజ్రీవాల్‌కు ఉన్నందున, పిటిషన్‌ను స్వీకరించలేమని సుప్రీంకోర్టు రిజిస్ట్రీ స్పష్టం చేసింది. కేజ్రీవాల్ తన ఆరోగ్య కారణాలను పేర్కొంటూ సోమవారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ను అత్యవసరంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ను తక్షణమే విచారించేందుకు సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. ఆ తరువాత మళ్లీ మధ్యంతర బెయిల్ గడువును పొడిగించాలని అరవింద్ కేజ్రీవాల్ తరపున దరఖాస్తు చేసుకున్నారు. అయితే బుధవారం మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలన్న రిజిస్ట్రార్ దరఖాస్తును సుప్రీంకోర్టు అంగీకరించలేదు. ఆయన దరఖాస్తు తిరస్కరించింది.

స్వాతి మాలివాల్ దాడి కేసు .. హైకోర్టుకు బిభవ్‌కుమార్

న్యూఢిల్లీ : ఆప్ ఎంపి స్వాతిమాలివాల్‌పై దాడి కేసులో నిందితుడు బిభవ్‌కుమార్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. స్వాలిమాలివాల్‌పై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి బిభవ్ కుమార్ దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా దుమారం రేగింది. స్వాతి ఫిర్యాదు మేరకు బిభవ్‌కుమార్ ఈ నెల18న పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్నారు. బిభవ్ ఈ దాడి కేసులో హైకోర్టును ఆశ్రయించారు. ఈ దాడి కేసులో తనను అక్రమంగా అరెస్టు చేశారని ఆయన ఆరోపించారు. కాగా, బిభవ్‌కుమార్ బెయిల్ పిటిషన్‌ను దిగువ కోర్టు సోమవారం తిరస్కరించింది. ఈ కేసులో వాదనలు విన్న మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ గౌరవ్ గోయల్.. బిభవ్‌కుమార్‌కు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో ఆయన తాజాగా తన అరెస్టును ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేశారు.

కవితపై ఇడి సప్లిమెంటరీ ఛార్జిషీట్‌ను.. పరిగణనలోకి తీసుకున్న రౌస్ ఎవెన్యూ కోర్టు

- తదుపరి విచారణ జూన్ 3 కు వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పాత్రపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఇడి) దాఖలు చేసిన ఛార్జ్ షీట్ ను రౌస్ అవెన్యూ (ట్రయల్) కోర్టు పరిగణలోకి తీసుకున్నట్లు ప్రకటించింది. అలాగే జ్యూడీషియల్ కస్టడీలో ఉన్న కవిత, చన్‌ప్రీత్ సింగ్ లకు రక్షణ వారెంట్, మరో ముగ్గురు నిందితులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 3కు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. ఈ తేదీన కవిత, చణ్ ప్రీత్ సింగ్ లను కోర్టులో హాజరుపరచాలని జైలు అధికారులను ఆదేశించింది. అలాగే దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, అరవింద్ సింగ్‌లను అరెస్టు చేయకపోవడంతో 3న వీరు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని సమన్లలో స్పష్టం చేసింది. కాగా, ఈనెల 10న కవితతో పాటు మరో నలుగురు నిందితుల పాత్రపై దాదాపు 8 వేల పేజీలతో 6వ సప్లమెంటరీ ప్రాసిక్యూషన్ ఫిర్యాదు (అనుబంధ చార్జ్ షీట్)ను ఈడి దాఖలు చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్, సెక్షన్ 45, 44(1) ప్రకారం ఈ అనుబంధ చార్జ్ షీట్ డాక్యుమెంట్స్ ను ట్రంకు పెట్టెలో కోర్టులో సమర్పించింది. ఎమ్మెల్సీ కవిత, ఆప్ గోవా ప్రచారాన్ని నిర్వహించిన ముగ్గురు ఉద్యోగులు (చారియట్ ప్రొడక్షన్స్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్) దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, చణ్ ప్రీత్ సింగ్, ఇండియా ఎహెడ్ న్యూస్ ఛానల్ మాజీ ఉద్యోగి అరవింద్ సింగ్ లను తాజా ఛార్జీషీటులో నిందితులుగా పేర్కొంది. ఈ చార్జ్ షీట్ ను పరిగణలోకి తీసుకోవాలని ఈడి తరపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్ కె మట్ట ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజాను కోరారు.

మూడోరౌండ్‌కు అల్కరాజ్

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ మూడోరౌండ్‌లోకి స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కరాజ్ ప్రవేశించాడు. బుధవారం జరిగిన రెండోరౌండ్ పోటీలో 3వ సీడ్ అల్కరాజ్ 6-3, 6-4, 2-6, 6-2తో డీ-జంగ్(ఫ్రాన్స్)ను ఓడించాడు. మరో పోటీలో 9వ సీడ్ సిట్సిపాస్(గ్రీక్) 6-3, 6-2, 6-7(2-7), 6-4తో అల్టిమేయర్(జర్మనీ)పై చెమటోడ్చి నెగ్గాడు. ఇక మహిళల సింగిల్స్‌లో 8వ సీడ్ అన్స్ జబీర్ మూడోరౌండ్‌లోకి ప్రవేశించారు. జబీర్ 6-3, 1-6, 6-3తో సెర్రెన్నో(కొలంబియా)ను ఓడించింది. మరో పోటీలో 21వ సీడ్ ఫ్రాన్స్‌కు చెందిన గార్సియా అనూహ్యంగా రెండోరౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. గార్సియాపై అమెరికాకు చెందిన కెనిన్ 6-3, 6-3తో వరుససెట్లలో విజయం సాధించింది. మరో పోటీలో 26వ సీడ్ బుల్టర్(ఇంగ్లండ) 6-4, 5-7, 4-7తో బడోసా(స్పెయిన్) చేతిలో అనూహ్యంగా ఓటమిపాలైంది.

టాప్‌లోనూ సూర్యకుమార్

ఆల్‌రౌండర్ల జాబితాలో అక్షర్ పటేల్ తొలిసారి మూడో ర్యాంక్‌కు..

దుబాయ్: ఐసిసి టి20 ర్యాంకింగ్స్‌లో టీమిండియా మిస్టర్ 360డిగ్రీస్ సూర్యకుమార్ యాదవ్ మరోసారి అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) తాజా టి20 బ్యాటర్ల జాబితాలో సూర్యకుమార్ యాదవ్ 861 పాయింట్లతో టాప్‌లో ఉన్నాడు. ఆ తర్వాత ఫిల్ సాల్ట్(ఇంగ్లండ్) 788 పాయింట్లు, మహ్మద్ రిజ్వాన్(పాకిస్తాన్) 769 పాయింట్లు, బాబర్ ఆజం 761పాయింట్లు, మార్క్రమ్(దక్షిణాఫ్రికా) 733 పాయింట్లు టాప్-5లో ఉన్నారు. ఇక టీమిండియా ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ ఐసిసి ర్యాంకింగ్స్‌లో దుమ్మురేపాడు. టి20 ఆల్‌రౌండర్ల జాబితాలో తొలిసారిగా మూడో స్థానం సంపాదించాడు. టీమిండియా స్పిన్నర్ రవి బిష్ణోయి టాప్-5లో చోటు దక్కించుకోవడం విశేషం.

సింధు శుభారంభం

సింగపూర్ బ్యాడ్మింటన్ టోర్నీ

సింగపూర్: సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో పివి సింధు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో సింధు వరుససెట్లలోనూ డెన్మార్క్ షట్లర్‌ను చిత్తుచేసి రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లింది. తొలిరౌండ్‌లో సింధు 21-12, 22-20తో కేవలం 44 నిమిషాల్లోనే హోమార్క్(డెన్మార్క్)ను ఓడించింది. రెండోరౌండ్‌లో సింధుకు గట్టి ప్రతిఘటన ఎదురుకానుంది.

స్పెయిన్‌కు చెందిన కరోలినా మారిన్‌తో సింధు తలపడనుంది. ఇక పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్ రాయ్ మూడుసెట్ల హోరాహోరీ పోరులో గెలుపొందగా.. లక్ష్యసేన్ టాప్‌సీడ్ అక్సెల్సన్ చేతిలో పోరాడి ఓడాడు. ప్రణయ్ 21-9, 18-21, 21-9తో క్రరాజి(జర్మనీ)ని చిత్తుచేయగా.. లక్ష్యసేన్ 13-21, 21-16, 13-21తో అక్సెల్సన్ చేతిలో ఓడాడు. రెండోరౌండ్‌లో ప్రణయ్.. జపాన్‌కు చెందిన నిషిమోటోతో తలపడనున్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68